


# విజయభాను




విశాఖపట్నం, శుక్రవారం 19-01-2024 VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM సంపుటి : 48 సంచిక : 105 పేజీలు : 08 వెల : 1 రూపాయి

## అక్కచెల్లెమ్మలకు
# ఆస్తి ఇవ్వగలిగాం

### రూ.46.90కోట్లను బటన్ నొక్కి బ్యాంక్ ఖాతాల్లో జమ చేసిన సిఎం జగన్




అమరావతి: 12.77 లక్షల మంది అక్క చెల్లెమ్మలకు పావలావడ్డీ రుణాలు ఇప్పించామని, ఈ దఫాలో 4.07 లక్షల మందికి వడ్డీ రియింబర్స్ కింద రూ.46.9 కోట్లు ఇవాళ విడుదల చేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయం నుంచి బటన్ నొక్కి బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈకార్యక్రమం జరుగుతుంది. గతంలో సుమారు ఐదు లక్షలకు పైబడి అక్క చెల్లెమ్మలకు రూ.50 కోట్ల పైబడి ఇచ్చాం. రూ.35వేల రుణాలను పావలా వడ్డీకే ఇస్తున్నాం. దేశ చరిత్రలో ఎప్పుడూ కూడా జరగని విధంగా 31,19,000 ఇళ్ల స్థలాలు అక్క చెల్లెమ్మలకు ఇచ్చాం. అందులో ఇప్పటికే 22లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. ఒక్కో ఇంటికి 2.7 లక్షలు ఖర్చు అవుతుంది. మౌలిక సదుపాయాలకు మరో రూ.1 లక్ష ఖర్చు అవుతోంది. ఇళ్ల నిర్మాణంకోసం ఉచితంగా ఇసుక ఇస్తున్నాం" అని సీఎం పేర్కొన్నారు.

"సిమెంటు, స్టీల్, మెటల్


తరువాయి 2లో..

## అయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ట..
### కేంద్రం కీలక ప్రకటన

న్యూఢిల్లీ: ఉత్తర ప్రదేశ్‌లోని అయోధ్యలో శ్రీ రాముడి ప్రాణ ప్రతిష్ట సందర్భంగా కేంద్రం కీలక ప్రకటన చేసింది. ఈ నెల 22న హాఫ్ హాలీడే ప్రకటిస్తున్నట్లు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే కార్యాలయాలన్నింటికి ఈ హాఫ్ హాలీడే వర్తించనున్నట్లు తెలిపారు. అయోధ్యలోని రామాలయంలో జరిగే రామ్ లల్లా విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. విగ్రహ ప్రాణ ప్రతిష్ట పూర్తయ్యేంత వరకు ఒకపూట సెలవు వర్తిస్తుందని కేంద్రం పేర్కొంది. ఈ మేరకు కేంద్రం నోటిఫికేషన్ కూడా విడుదల చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా 22న అయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి సన్నాహాలు జోరుగా సాగుతున్నాయి.

ఈ నేపథ్యంలో అయోధ్య నగరమంతా రామమయంగా మారిపోయింది. ప్రతిచోటా 'జై శ్రీరామ్' నినాదాలు వినిపిస్తున్నాయి. శ్రీరామ్‌లల్లాకు జరిగే పట్టాభిషేకం కోసం అయోధ్యవాసులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## 'రామమందిరం'పై పోస్టల్ స్టాంప్‌లు.. విడుదల చేసిన మోదీ



దిల్లీ: అయోధ్య రామమందిరం లో విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవానికి ముహూర్తం సమీపిస్తోంది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ గురువారం రామమందిరంపై స్మారక పోస్టల్ స్టాంప్‌లను విడుదల చేశారు. రామమందిరం, గణనాథుడు, హనుమంతుడు, జటాయువు, కేవత్‌రాజ్, శబరిమాతపై మొత్తం ఆరు స్టాంప్‌లను విడుదల చేశారు. అయోధ్య ఆలయ ఆకృతి, మందిరం ఆవరణలోని కళాఖండాలు, సూర్యభగవానుడు, సరయూ నది ప్రతిబిం బించేలా వీటిని డిజైన్ చేశారు. 'మంగళ్ భవన్ అమంగళ్ హరి' అనే కవిత్వాన్ని కూడా ముద్రించారు. దీంతో పాటు శ్రీరాముడిపై ప్రపంచవ్యాప్తంగా విడుదలైన స్టాంపులతో రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. 48 పేజీల ఈ బుక్‌లో 20కి పైగా దేశాలు విడుదల చేసిన స్టాంప్‌లను పొందుపర్చారు. అమెరికా, న్యూజిలాండ్, సింగపూర్, కెనడా, కాంబోడియా దేశాలు సహా ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థలు శ్రీరాముడిపై స్మారక స్టాంప్‌లను విడుదల చేశాయి. రామమందిరం ప్రారంభం నేపథ్యంలో దేశవిదేశాల నుంచి భక్తులు అయోధ్యకు పోటెత్తుతున్నారు. ఈ క్రమంలోనే అక్కడి వాతావరణాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేందుకు వీలుగా భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ప్రత్యేక పేజీని ప్రారంభించింది.

# 25న వైసీపీ ఎన్నికల శంఖారావం



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : వైసీపీ తన ఎన్నికల ప్రచారాన్ని ఉత్తరాంధ్ర నుంచే శంఖారావం పూరించనుందని ఆంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వై వి సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. వైసీపీ అధినేత, సీఎం జగన్ ఈ నెల 25న భీమిలిలో భారీ బహిరంగ సభ నిర్వహించి క్యాడెర్ను ఉత్తేజ పర్చనున్నారు. ఇదే విషయాన్ని ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి గురువారం విలేకరుల వద్ద స్పష్టం చేశారు. ఆ రోజు ఒక్కో నియోజకవర్గం నుంచి కనీసం 5నుంచి6వేల మందిని తీసుకుని వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీ క్రియాశీల కార్యకర్తలతో కూడా సీఎం జగన్ సమావేశమవుతారని, భీమిలి లో జరిగే బహిరంగ సభ ద్వారా కేడర్ కు ఆయన దిశానిర్దేశం చేయనున్నారని వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. వైసీపీలో అసంతృప్తులు తొలగించడం, ఎమ్మెల్యే అభ్యర్థుల మార్పులకు గల కారణాల్ని నేరుగా సిఎం వివరిస్తారని వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ విధంగా ఏపీ వ్యాప్తంగా ఐదు ప్రాంతీయ సమావేశాల్ని నిర్వహించనున్నామని, వచ్చే ఎన్నికల్లో తమ లక్ష్యం 175కు 175 అనేనని తేల్చి చెప్పారు. విశాఖలో ఈ మేరకు వైవీ సుబ్బారెడ్డి గురువారం ఉత్తరాంధ్రకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కీలక సమావేశం కూడా నిర్వహించారు. సమావేశానికి మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్నాథ్, సీదిరి అప్పలరాజు, మాజీ మంత్రి పుష్ప శ్రీవాణి,తదితర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

## ప్రజలారా రండి..
## రామన్న రాజ్యాన్ని తిరిగి సాధించుకుందాం

### తెదేపా అధినేత చంద్రబాబు



అమరావతి: దేశంలో సంక్షేమ పాలనకు ఆద్యుడు నందమూరి తారక రామారావు అని తెదేపా అధినేత చంద్రబాబు కొనియాడారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా 'ఎక్స్' (ట్విటర్) వేదికగా ఆయనను స్మరించుకున్నారు. "ఒకే ఒక జీవితం.. రెండు తిరుగులేని చరిత్రలు. కృషి, పట్టుదల, క్రమశిక్షణ అనే ఆయుధాలతో ఒక రైతుబిడ్డ సాధించిన అద్వితీయ విజయానికి ప్రతీక ఎన్టీఆర్. తెలుగునాట నిరుపేదకు రామరాజ్య సంక్షేమాన్ని అందించిన మానవతావాది.. తెలుగు జాతికి తరతరాలకు సరిపడా ఖ్యాతిని వారసత్వంగా ఇచ్చిన వెలుగు ఆయన. పేదరికం లేని, కులమతాలకు అతీతమైన సమ సమాజాన్ని స్థాపించాలన్న ఎన్టీఆర్ కలను నిజం చేయడమే మన కర్తవ్యం కావాలి. బలహీన వర్గాల అణచివేత, పేదలను ఇంకా పేదలుగా మారుస్తున్న పాలన, సమాజంలో ఏ ఒక్కరికీ దక్కని భద్రతతో తెలుగునేల అల్లాడుతున్న ఈ వేళ.. రామరాజ్య స్థాపనకు మనందరం కదలాలి. అందుకే 'తెలుగుదేశం పిలుస్తోంది.. రా.. కదలిరా' అని ఆనాడు ఎన్టీఆర్ ఇచ్చిన పిలుపు స్ఫూర్తిగా.. నేను 'రా... కదలిరా' అని పిలుపునిచ్చాను. తెలుగు ప్రజలారా! రండి.. ఆనాటి రామన్న రాజ్యాన్ని తిరిగి సాధించుకుందాం. ఎన్టీఆర్‌కు అసలైన నివాళి అర్పించుదాం" అని పిలుపునిచ్చారు.

**కారణ జన్ముడికి జోహార్లు**

తెలుగుజాతి ఖ్యాతి, మహానాయకుడు ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నా. కోట్లాది హృదయాల్లో కొలువైన కారణ జన్ముడికి జోహార్లు.

## భారత్ స్పేస్ స్టేషన్..
### ఇస్రో చైర్మన్ కీలక ప్రకటన



చండీగఢ్: భారత్ సొంత అంతరిక్ష కేంద్రం ఏర్పాటుపై ఇస్రో చైర్మన్ సోమనాథ్ కీలక విషయం వెల్లడించారు. భారత స్పేస్ స్టేషన్ ప్రాథమిక వెర్షన్ 2028లో నింగిలోకి వెళుతుందని తెలిపారు. హర్యానాలోని ఫరీదాబాద్‌లో గురువారం జరిగిన ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ కార్యక్రమం సందర్భంగా సోమనాథ్ మాట్లాడారు. 'భారత్ స్పేస్ స్టేషన్‌కు సంబంధించి వచ్చే ఏడాదికల్లా తొలి రౌండ్ పరీక్షలు నిర్వహిస్తాం. స్పేస్ స్టేషన్ బేసిక్ మోడల్‌ను 2028లో కక్ష్యలోకి పంపి 2035కల్లా దానికి పూర్తిస్థాయి రూపు తీసుకువస్తాం. స్పేస్

తరువాయి 2లో..

# పారదర్శకత లోపించకుండా ఓటర్ల జాబితా రూపకల్పన

### అధికారులతో ఓటర్ల జాబితా పరిశీలకులు జె. శ్యామలరావు సమీక్ష



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** ఓటర్ల జాబితా రూపకల్పనలో పారదర్శకత లోపించకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, పక్కా జాబితాను రూపొందించి ప్రచురించాలని పరిశీలకులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ జె. శ్యామలరావు జిల్లా అధికారులను ఆదేశించారు. యువ ఓటర్ల నమోదుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, తప్పులు దొర్లకుండా జాబితాను రూపొందించాలని సూచించారు. జిల్లా పర్యటనలో భాగంగా గురువారం ఉదయం స్థానిక ఆర్డీవో కార్యాలయ మీటింగ్ హాలులో జాయింట్ కలెక్టర్, డీఆర్వో, ఈఆర్వోలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జాబితా రూపకల్పన, సవరణ ప్రక్రియపై సమీక్షించారు. పక్కా జాబితాను రూపొందించేందుకు అనురించే విధానాలపై దిశానిర్దేశం చేశారు.

సమీక్షలో భాగంగా నియోజకవర్గాల వారీగా జాబితాలను పరిశీలిస్తూ ఆయన పలు అంశాలపై ఆరా తీశారు. జిల్లాలోని జనాభా, ఓటర్లు, పోలింగ్ స్టేషన్ల నిష్పత్తి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఒకే చోట ఐదుకు మించి ఉన్న పోలింగ్ స్టేషన్ల వివరాలను అడుగుతూ భద్రతాపరమైన లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఫైనల్ జాబితా ప్రచురణ కాపీలను రాజకీయ పార్టీల జిల్లా ప్రెసిడెంట్ లేదా సెక్రటరీలకు అందజేయాలని చెప్పారు. అలాగే పోలింగ్ స్టేషన్లలో జాబితాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. సెలక్టోరల్ అధికారుల నియామకం, రిపోర్టింగ్ అథారిటీ గురించి అడిగి తెలుసుకున్నారు. రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులేమైనా ఉంటే తక్షణమే పరిష్కరించాలని ఈఆర్వోలను పరిశీలకులు జె. శ్యామలరావు ఆదేశించారు. అందరూ సమన్వయం వహించి పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు.

సమావేశంలో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు తీసుకున్న చర్యల గురించి జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ ఓటర్ల జాబితా పరిశీలకులకు వివరించారు. జనవరి 22వ తేదీన ఫైనల్ లిస్టు ప్రచురించనున్న నేపథ్యంలో పటిష్ట చర్యలు చేపట్టామని తెలిపారు. రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులకు నిర్ణీత కాలంలో పరిష్కారం చూపామని వెల్లడించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, ఈఆర్వోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర రెడ్డి, లక్ష్మారెడ్డి, మూర్తి, శేష శైలజ, అఖిల, ఎన్నికల సెల్ అధికారులు, ఎన్నికల డీటీలు పాల్గొన్నారు.



## అంగన్వాడీ లకు ప్రభుత్వం ఇచ్చిన
# నోటీసులకు నిరసనగా ర్యాలీ




భీమునిపట్నం విజయభాను న్యూస్ : అంగనవాడి కార్యకర్తలకి ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 2 నోటీసులు కు అంగన్వాడీ స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం నకు ర్యాలీ గా వెళ్లి వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీ కార్యకర్తలు స్థానిక స్టేట్ బ్యాంకు నుంచి పోలీస్ స్టేషన్ మీదుగా ఐ సి డి ఎస్ ఆఫీసుకు పెద్ద ఎత్తున ర్యాలీ గా వెళ్లి ప్రభుత్వం జనవరి తొమ్మిదవ తేదీన అంగనవాడి కార్యకర్తలు చేస్తున్నటువంటి సమ్మెను విచ్చన్నం చేయటానికి జీవో నెంబర్ 2 నోటీసు ఇచ్చి పది రోజుల్లో సమాధానం ఇవ్వాలని కోరిందనీ, అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్నటువంటి సమ్మె చట్టబద్ధమైనదని, ప్రభుత్వం నెల రోజుల ముందు మా సమస్యలు పరిష్కరించాలని, లేనియెడల సమ్మె బాట పడతామని చెప్పిన తర్వాత అంగన్వాడీ కార్యకర్తలు సమ్మె నోటీసు ఇచ్చిన తర్వాత సమ్మెలోకి వెళ్లడం జరిగినదనీ అన్నారు. తర్వాత ప్రభుత్వం పలుమార్లు చర్చలు చేసినప్పటికీ అంగన్వాడి కార్యకర్తలు డిమాండ్లను పరిష్కరించుక పోగా అంగన్వాడీ కార్యకర్తలని భయభ్రాంతులకు గురి చేయటానికి జీవో నెంబర్ 2 నోటీసు విడుదల చేసిందనీ చెప్పారు. ప్రభుత్వం సమస్యల పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నదనీ , గర్భవతులకు బాలింతలకు చిన్నపిల్లలకు ఎటువంటి హానిజరిగిన ప్రభుత్వమే బాధ్యత వహించవలసి ఉంటుందనీ తెలిపారు. ఇప్పటికైనా పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా జీతాల పెంచి సమ్మెను విరమింపజేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ ఎస్ ఎన్ మూర్తి, ప్రాజెక్టు గౌరాధ్యక్షులు కే వెంకటలక్ష్మి, ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు శ్రీదేవి, పద్మ, లక్ష్మి, సెక్టర్ లీడర్స్ కోమలి శ్రీదేవి, ఎస్వీ లక్ష్మి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## ఏ యూ తెలుగు విభాగం ఆధ్వర్యంలో
# వేమన జయంతి వేడుకలు

ఆంధ్రవిశ్వవిద్యాలయం **(విజయభాను న్యూస్)** : ఆంధ్ర విశ్వ కళాపరిషత్ తెలుగు విభాగం ఆధ్వర్యంలో తొలి తెలుగు ప్రజాకవి సామాజిక చైతన్య వారధి, అభ్యుదయవాది ,హేతువాది, మూఢ విశ్వాసాలపై తిరుగుబావుటా ఎగురవేసి సమాజాన్ని మేల్కొల్పిన విప్లవ వైతాళికుడు వేమన జయంతి వేడుకలను శుక్రవారం ఉదయం 10 గంటలకు తెలుగు విభాగ సమావేశం మందిరంలో నిర్వహిస్తున్నట్లు తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య జర్రా అప్పారావు తెలియజేశారు. తన కలం ద్వారా గళం విప్పి సామాజిక చైతన్యాన్ని కలిగించిన వేమన సాహిత్యం నేటి యువతకు ఎంతో ఆదర్శప్రాయమైనదని అటువంటి వ్యక్తి జయంతి వేడుకలను నిర్వహించవలసిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని వెల్లడించారు. ఈ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త శ్రీ పి కన్నయ్య, ఆత్మీయ అతిథిగా తెలుగు విభాగ సీనియర్ ఆచార్యులు ఆచార్య గజ్జా యోహాన్ బాబు, వక్తలుగా ఆచార్య వెలమల సిమ్మన్న, పరిశోధక విద్యార్థులు మరియు స్నాతకోత్తర విద్యార్థులు పాల్గొంటారని తెలియజేశారు. వారితోపాటు ఆచార్య బూసి వెంకటస్వామి ,ఆచార్య సీతారత్నం, డాక్టర్ అన్నంశెట్టి ఈశ్వరమ్మ, కట్టెపోగు రత్న శేఖర్ ,డాక్టర్ పెండ్యాల లావణ్య ,డాక్టర్ ఏ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎల్ గిరీష్ కుమార్ తదితరులు పాల్గొంటారన్నారు.

## కొత్త బోరు మంజూరు - కార్పొరేటర్ మొల్లి హేమలత



విశాఖ రూరల్ : మధురవాడ (విజయభాను న్యూస్) : చాల కాలంగా మరమ్మతులకు గురై పాడైపోయిన బోరు స్థానంలో గురువారం కొత్త బోరు వేసి మారికవలస ఓజోన్ వేలీ కాలనీ వాసులకు అండగా నిలిచారు 5 వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ మారికవలస ఓజోన్ వేలి కాలనీ లో త్రాగునీటి బోరు మరమ్మతులకు గురై ఇబ్బంది పడుతున్నామని ఆమె దృష్టికి తీసుకురాగా, విషయాన్ని జీవీఎంసీ మేయర్, కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి కొత్త బోరు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు, ఇంకా వార్డ్ లో అనేక చోట్ల త్రాగునీటి సమస్య ఉందని కౌన్సిల్ సమావేశాల్లో చర్చించి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, కాలనీ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ కి ఘన నివాళులు అర్పించిన పార్టీ అధ్యక్షులు వియ్యపు చిన్న



పరవాడ:- పరవాడ మండలంరావాడ గ్రామ పంచాయితి ఎన్టీఆర్ కాలనీ లో స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి వియ్యపు చిన్నా ( మండల తెలు గుదేశం పార్టీ అధ్యక్షులు) పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సారిపల్లి జోగి నాయుడు (మాజీ ఎంపీటీసీ), కావలి అప్పలరాజు వైస్ సర్పంచ్, మొటూరు సూరి బాబు, రేఖా అప్పారావు, మరిశ బుల్లు అబ్బాయి, మరిశా శ్రీను, ఆచంట రాజు, కొర్ని కన్నం నాయుడు,మువ్వల సింహాచలం , చుక్క తాతారావు, మోటూరు అప్పారావు, కోన కృష్ణ, గంగిరెడ్ల సన్యాసి రావు, ద్వార పూడి సంతోష్,మామిడి మురళీ , రేఖా శ్రీను, గణపర్థి గణేశ్,మువ్వల రాము, రాంగ్గలి గంగునాయుడు , ప్రజలు, యువకులు,మహిళలు పెద్ధ ఎత్తున పాల్గొన్నారు.

# భారత్ స్పేస్ స్టేషన్..
## ఇస్రో చైర్మన్ కీలక ప్రకటన

స్టేషన్ క్రూ కమాండ్ మాడ్యూల్, నివాస మాడ్యూల్, ప్రొపల్షన్ మాడ్యూల్, డాకింగ్ పోర్ట్ అనే విభాగాలు కలిగి ఉంటుంది.

ఈ మొత్తం స్టేషన్ 25 టన్నుల బరువు ఉంటుంది. అవసరమైతే తర్వాత దీనిని విస్తరిస్తాం. స్పేస్ స్టేషన్ ద్వారా మైక్రో గ్రావిటీ పరిశోధనలు చేస్తాం' అని సోమనాథ్ తెలిపారు. కాగా, ఇప్పటివరకు నింగిలో అంతర్జాతీయ స్పేస్ స్టేషన్(ఐఎస్ఎస్) మాత్రమే ఉంది. దీనిని అమెరికా, కెనడా, జపాన్, యూరప్ సంయుక్తంగా నిర్మించాయి. 1984నుంచి 1993 మధ్య ఐఎస్ఎస్‌ను డిజైన్ చేశారు.

## ఉపకార వేతనాల పంపిణీ చేసిన దివీస్ యాజమాన్యం




భీమునిపట్నం : విజయభాను న్యూస్ : భీమిలి మండలం చిప్పాడ లో ఉన్న దివిస్ లేబరేటరీస్ వారు తమ చుట్టుపక్కల ఉన్న చిప్పాడ, పెదనాగమయ్యపాలెం, మూలకుద్దు, అన్నవరం, టీ నగరపాలెం, గుడివాడ,తూడెం, చెరుకుపల్లి, లింగాలవలస పంచాయతీలకు చెందిన 73 మంది విద్యార్థిని విద్యార్థులకు గురువారం దివిస్ వైస్ ప్రెసిడెంట్స్ సూరెడ్డి దేవేందర్, ఎల్ వి రమణ చేతులమీదుగా సుమారు నాలుగు లక్షల 39వేల రూపాయలు ఉపకార వేతనాలను అందజేశారు. 8 వ తరగతి నుండి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు చదువుతూ 2022-23 విద్యా సంవత్సరం మార్కుల ఆధారంగా పంచాయితీల నుండి దరకాస్తు చేసుకొన్న వారిలో అత్యధిక మార్కులు సాధించిన వారికి ఈ ఉపకార వేతనాలు అందించడం జరిగిందని జనరల్ మేనేజర్ వై యస్ కోటేశ్వరరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మరొక జనరల్ మేనేజర్ ఎమ్ ఎస్ ఎన్ రావు మాట్లాడుతూ విద్యార్థులు వారి భవిష్యత్తు లో ఏమీ చదవాలను కొంటున్నారో పాఠశాల స్థాయి లోనే ప్రణాళిక రూపొందించుకొని కృషి చేస్తే తప్పక ఉన్నత స్థాయికి చేరుకునేందుకు ఎంతో సహాయ పడుతుందని సూచించారు. శ్రీ సూరెడ్డి దేవేందర్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి దివీస్ పలు రకాల అభివృద్ధి కార్యక్రమాలు ద్వారా ఎల్లప్పుడూ చేయూత నిస్తుందని తెలియజేశారు. విద్యార్థులు నిబద్ధత తో విద్యను పూర్తి చేసి మంచి విజయాలు సాధించాలని వైస్ ప్రెసిడెంట్ ఎల్.వి. రమణ ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో సి ఎస్ ఆర్ మేనేజర్ డి. సురేష్ కుమార్ ప్రతినిధులు ఏ. శ్రీనివాస్, నరసింహ,శేఖర్, బిందు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 2వ వార్డులో ఎన్ టి ఆర్ వర్ధంతి



భీమునిపట్నం : విజయబాను న్యూస్ తెలుగుజాతి గర్వించదగ్గ నాయకుడు, టీడీపీ పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు 28వ వర్ధంతి సందర్భంగా భీమిలి నియోజకవర్గం 2వ వార్డు లోని తాతా థియేటర్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి బ్యాంకు కాలనీలో ఉన్న విగ్రహానికి లకు 2వ వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమం లో, టీడీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# అక్కచెల్లెమ్మలకు ఆస్తి ఇవ్వగలిగాం

ఫ్రేంలు తదితర ఇంటి సామగ్రి మీద కనీసంగా రూ.40వేలు మంచి జరిగేలా చూస్తున్నాం. ఒక్కో ఇంటి స్థలం విలువ జిల్లాను బట్టి, ప్రాంతాన్ని బట్టి రూ.2.5లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ ఉంది. అన్ని కలుపుకుంటే దాదాపు ప్రతి అక్క చెల్లెమ్మకు రూ.5 -20 లక్షల వరకూ ఒక ఆస్తిని అక్కచెల్లెమ్మలకు ఇవ్వగలిగాం. ఈ అవకాశం దేవుడు నాకు ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. కేవలం పావలా వడ్డీకే రూ.35వేల చొప్పున రుణాలు ఇప్పిస్తున్నాం. ఈ మంచి కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తాం" అని సీఎం జగన్ తెలిపారు.

కాగా, రాష్ట్రంలో ఇళ్లు లేని పేదింటి అక్కచెల్లెమ్మలకు తోబుట్టువుగా వారి సొంతింటి కలను సీఎం జగన్ సాకారం చేస్తున్నారు. 'నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు' పథకం కింద రికార్డు స్థాయిలో నివేశన స్థలాలను పంపిణీ చేయడంతోపాటు ఇళ్లను మంజూరు చేశారు. ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం చేయడంతో పాటు రాయితీపై సాయమ్రిగ్రి అందిస్తున్నారు. ఇళ్ల లబ్ధిదారులు బ్యాంకు నుంచి పొందిన రుణాలకు వడ్డీని కూడా రీయింబర్స్‌మెంట్ చేయునున్నారు. తొలి విడత లబ్ధిదారులకు వడ్డీని రీయింబర్స్‌మెంట్ చేశారు.

సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు స్వీకరించిన తుర్వాత రాష్ట్రవ్యాప్తంగా 71,811.50 ఎకరాల విస్తీర్ణంలో 31లక్షల ఇళ్ల పట్టాలను అక్కచెల్లెమ్మల పేరిట పంపిణీ చేశారు. ఇంటి నిర్మాణానికి యూనిట్‌కు రూ.1.80 లక్షలు చొప్పున ఇవ్వడమే కాకుండా, ఉుచితంగా ఇసుక సరఫరా ద్వారా రూ.15 వేలు, సిమెంట్, స్టీలు, మెటల్ ఫ్రేమ్స్, ఇతర నిర్మాణ సామగ్రిని తక్కువ ధరకే అందించడంతో మరో రూ.ఐ40 వేల మేర లబ్ధి కల్పింస్తున్నారు. పావలా వడ్డీకే రూ.35వేలు చొప్పున బ్యాంకు రుణం అందిస్తున్నారు. ఇలా మొత్తంగా ఒక్కో లబ్ధిదారుకు రూ.ఐ2.70 లక్షలు చొప్పున లబ్ధి చేకూరుస్తున్నారు.

దీనికి అదనంగా మరో రూ.లక్షకు పైగా ప్రతి ఇంటిపై మౌలిక వసతులకు ఖర్చు పెడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 22 లక్షల ఇళ్ల నిర్మాణం చేపడుతుండగా, ఇప్పటికే 8.6 లక్షలకు పైగా ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు ప్రభుత్వం అందించింది. మిగిలిన ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. కాగా, ఇప్పటి వరకు 12.77 లక్షల మంది లబ్ధిదారులకు రూ.4,500.19 కోట్లు బ్యాంకు రుణాల ద్వారా అందించారు. బ్యాంకులు 9 నుంచి 11 శాతం వడ్డీతో రుణాలు ఇస్తున్నాయి.

అయినా అక్కచెల్లెమ్మలపై భారం పడకుండా పావలా వడ్డీకే రుణాలు అందిస్తూ ఆపై వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. తొలి దఫా అర్హులైన 4,07,323 మంది లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ కింద రూ.46.90 కోట్లను గురువారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కి బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. ఇలా సంవత్సరంలో రెండు పర్యాయాలు వడ్డీ రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం అందించనుంది.

## సింహాద్రి ఏసీ కళ్యాణ మండపం సందర్శించిన ఎన్టిపిసి అధికారులు



పరవాడ:- వెన్నెలపాలెంలో ఉన్న సింహాద్రి (ఏ /సీ ) కళ్యాణమండపంను ఏన్టీపీసీ సింహాద్రి సి ఎస్ ఆర్ అధికారులు గురువారం సందర్శించారు..సర్పంచ్ వెన్నెల ఇంజనీర్ అప్పారావు అభ్యర్ధన మేరకు కళ్యాణమండపం పైన వధువు , వరుడుకు వసతి గదులు ఏర్పాటుకు నిధులు ఇవ్వటానికి ఎన్ టి పి సి ఎస్ ఆర్ అధికారులు అగింకరించారు.తధానంతరం కళ్యాణ మండపం అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ వెన్నెల అప్పారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.




విశ్వా విఖ్యాత నట సార్వభౌమ స్వర్గయ నందమూరి తారక రామారావు మనమధ్య నుంచి వెళ్లిపోయి28 ఏళ్ళ... ఈ సందర్భంగా విశాఖ తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్లో ఎన్టీఆర్ ట్రస్ట్ సేకరించిన లెజెండ్రీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్ లో ఎన్టీఆర్ అభిమాని మరియు లివిశాఖ టిడిపి పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షుడు విల్లూరి డాక్టర్ చక్రవర్తి బ్లడ్ను డొనేట్ చేయడం జరిగిందిలి కోట్లాది మంది గుండెల్లో అంతులేని శోకాన్ని మిగిల్చి సంక్షేమరాజ్యాన్ని మనకందించి వెళ్లిపోయారు.. ప్రజల గుండెల్లో ఆయన చిరస్మరణీయుడు... అందుకే ప్రతి సంవత్సరం కోట్లాది మంది ఆయన వర్ధంతి రోజున ఆ మహనీయుడుని స్మరించుకుంటున్నారు.. ఈ కార్యక్రమంలో సీనియర్ ఎన్టీఆర్ అభిమానులు వేగి రాధాకృష్ణ, ఎస్ ఎస్ ఎన్ మూర్తి, యోగి, గోపాలకృష్ణ బాలయ్య బాబు , శ్రీను (గన్) గుంపిన అప్పలరాజు, పట్నాల శ్రీనివాసరావు, సోమిశెట్టి సూరిబాబు, 31 వ వార్డు క్లస్టర్ ఇన్చార్జ్ వానపల్లి గాయత్రి పనుకుమారి, పార్లమెంట్ వైస్ ప్రెసిడెంట్ తోట రత్నం, పార్లమెంటు మహిళా ప్రధాన కార్యదర్శి, గనగళ్ళ సత్య, నార్త్ మహిళా ప్రెసిడెంట్ పలికిల శ్రీదేవి, స్టేట్ మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి అబ్దుల్ అనీఫ్ తదితరులు పాల్గొన్నారు

# తెలుగువారి ఆత్మగౌరవం ఎన్.టి.ఆర్.
## జీవీఎంసీ 5వ వార్డు కార్పొరేటర్ మొల్లిహేమలత



విశాఖ రూరల్ : మధురవాడ (విజయభాను న్యూస్) : ఎన్టీఆర్ ఒక ప్రభంజనమని తెలుగు వారి ఆత్మగౌరవం నలుదిక్కులా చాటిచెప్పిన మహానుబాహుడని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లిహేమలత కొనియాడారు. విశ్వవిఖ్యాత నటసార్వభౌమ స్వర్గీయ నందమూరి తారకరామారావు 28వ వర్ధంతి సందర్భంగా 5వ వార్డు పరిధి పరదేశిపాలెం జాతీయ రహదారి సమీపంలో గల ఎన్.టి.ఆర్. విగ్రహానికి 5వ వార్డ్ కార్పొరేటర్ మొల్లి హేమలత, టిడిపి రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మొల్లిలక్ష్మణరావు, విశాఖ జిల్లా పార్లమెంటరీ ఉపాధ్యక్షులు వాంద్రాశి అప్పలరాజు, వార్డ్ టిడిపి అధ్యక్షులు నాగోతి వెంకట సత్యనారాయణ(జపాన్), ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా 5వ వార్డ్ కార్పొరేటర్ మొల్లి హేమలత మాట్లాడుతూ తెలుగుజాతి ఉన్నతిని చాటిచెప్పిన మహానాయకుడని, ఎన్టీఆర్ చేసిన సేవా కార్యక్రమాలు మరియు సంక్షేమ పథకాలు గురించి ఈసందర్భంగా గుర్తు చేశారు. మొల్లిలక్ష్మణరావు, వాంద్రాశి అప్పలరాజు మాట్లాడుతూ ప్రపంచదేశాలో ప్రముఖ కళాకారుడిగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తెలుగువారి ఉనికిని దశ,దిశ,లకు చాటిచెప్పిన మహెూన్నతవ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. ఆయన ఆశయాలు తమ్ముళు ఆదర్శంగా తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ పూర్వ వైభవం తీసుకురా వడానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు నమ్మి శ్రీను, టిడిపి ప్రధాన కార్యదర్శి ఈగల రవికుమార్, ఉపాధ్యక్షులు ఈయ్యపు నాయుడు, కంబపు కామరాజు, యువత అధ్యక్షులు కొండపు రాజు, సీనియర్ నాయకులు బోర అప్పల సూరిబాబు రెడ్డి, చలుమోలు శ్రీనివాసరావు (గడ్డి శ్రీను),దాలేం దొర, బొడ్డేపల్లి రంగారావు, కురుమోజు గోవిందరావు, జోగేశ్వరపాత్రో, కొత్తల శ్రీనివాసరావు,బొర సూర్యచంద్ర,బోరాఎర్రయ్యా రెడ్డి,మోహన్, నల్లానా ఆనందరావు,అప్పన్న,చక్రి, శేఖర్,అవ్వ కృష్ణ,పిల్ల వెంకటరావు,కొవ్వాడ షణ్ముఖ, ఈగల అప్పలనాయుడు, ఇల్లిపిల్లి అప్పారావు, వైకుంఠరావు, కోర్రాయి మంగరాజు, బోట్ల సురేష్, ఓమ్మి సూరి,బొట్ట అప్పలరాజు, లక్ష్మణరావు ,ఓలేటి శ్రావణ్, వంక నూకరాజు,షేక్ మదీనా,పసుపులేటి మోహన్ రావు,విష్ణు, వెంకట సత్యనారాయణ,జ్ఞానేశ్వర్ రావ్,ఇమంది రాజు,మహిళ నాయకురాలు సరస్వతి, వియ్యపు సునీత, సొండి వనిత,అన్నపూర్ణ,రాజమ్మ ,సీతమ్మ, వరలక్ష్మి,ప్రసన్నకుమారి, అప్పన్న,అప్పలరాజు,కృష్ణ , శ్యామ్ ,రాధకృష్ణ, మరుపిల్ల చిన్న, కురుమోజు శ్రీనివాసరావు,గౌరీ శంకర్, జనసేన జిల్లా జాయింట్ సెక్రెటరీ శ్రీకాంత్, భారి సంఖ్యలో టీడీపీ,జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# టి డి పి కార్యాలయంలో ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం



భీమునిపట్నం : విజయభాను న్యూస్ : టి డి పి వ్యవస్థాపకులు, పద్మశ్రీ డా. నందమూరి తారకరామారావు వర్ధంతి కార్యక్రమం భీమిలి టి డి పి క్యాంపు కార్యాలయం లో నియోజకవర్గ ఇంచార్జ్ కోరాడ రాజబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా రాజబాబు భీమిలి చిన్న బజార్ జంక్షన్లో ఉన్న నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. తర్వాత భీమిలి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా రాజబాబు మాటాడుతూ బడుగు,బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎన్టీఆర్ ఎంతో కృషి చేసారనీ అన్నారు. ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ పార్టీని,జనసేన పార్టీ విజయం సాధించడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ నాలుగున్నర ఏళ్ళు ప్రజలు వై సీ పి పాలన వలన విసిగిపోయారనీ చెప్పారు. ఒక్క చాన్స్ అంటూనే ప్రజల ను నమ్మించి మోసం చేసారనీ అన్నారు.

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి గంటా నూకరాజు, టిడిపి నాయకులు డిఎవన్ రాజు మాట్లాడుతూ టీడీపీ పార్టీ అంటేనే ఎన్టీఆర్ ఆశయాలుకు కట్టుబడి పనిచేసిన పార్టీ అన్నారు. రానున్న ఎన్నికలలో మనందరం కష్టపడి టీడీపీ,జనసేన గెలుపునకు కష్టపడి పనిచేద్దామనీ చెప్పారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మారోజు సంజీవ్ , యోగి కృష్ణారావు మాస్టర్ కనకల అప్పల నాయుడు , కాసరపు నాగరాజు కాసరపు ఎల్లాజి కొక్కిరి అప్పన్న కంచర్ల కామేష్ కార్యకర్తలు పాల్గొన్నారు

# తెలుగుజాతి గౌరవాన్ని చాటిచెప్పిన ఎన్టీఆర్

## – ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా టిడిపి శ్రేణులు ఘన నివాళులు, రక్తదాన శిబిరం



విశాఖపట్నం (విజయభాను న్యూస్): తెలుగు జాతి గౌరవాన్ని చాటి చెప్పిన మహానుభావుడు దివంగత నందమూరి తారక రామారావు అని మాజీ మంత్రి, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు.స్వర్గీయ నందమూరి తారక రామారావు 28 వ వర్ధంతి సందర్భంగా గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ ఎన్టీ రామారావు రాజకీయాల్లోకి వచ్చిన తొలి రోజుల్లో ప్రభంజనం సృష్టించారని అన్నారు ఆయన రాష్ట్రం ముఖ్యమంత్రిగా అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందించారని ఆయన చేసిన సేవలను యాదారు తొలుత ఆయన విగ్రహానికి మాజీ మంత్రి ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు పార్లమెంట్ ఇన్చార్జ్ ఎమ్ శ్రీ భరత్ శాసనసభ సభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు గణబాబు శాసనసభ మాజీ సభ్యులు దక్షిణ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ గండి బాబ్జి జిల్లా ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ జి వి ఎమ్ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్ చోడే పట్టాభిరామ్ తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు అనంతరం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఉన్న అయన విగ్రహానికి పూలమాలలు వేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు రక్తదానం చేసిన వారిని అభినందించారు.





# నిరుపేదకు పదివేలు ఆర్ధిక సహాయం అందజేత



భీమునిపట్నం : విజయభాను న్యూస్ రోడ్డుప్రమాదం కు గురై తీవ్ర గాయాలతో మంచానికి పరిమితమయిన నిరుపేద వ్యక్తి కి కలిగొట్ల ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ ఆర్థిక సహాయం అందజేశారు. వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా భోగాపురం కు చెందిన సత్తూరు హేమంత్( 23) రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలతో మంచానికే పరిమితం అయిన విషయం భోగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయిని ఎన్. అరుణకుమారి ద్వారా తెలుసుకున్న కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ వెంటనే స్పందించి క్షతగాత్రునికి పదివేలు ఆర్థిక సహాయం ఫౌండేషన్ కార్యాలయంలో క్షతగాత్రుని తల్లికి అందజేశారు.

# కేంద్ర మంత్రికి రాష్ట్రమంత్రికి స్వాగతం పలికిన జడ్పిటిసి పిఎస్ రాజు



పరవాడ:–తిరుపతిలో మూడు రోజుల పాటు జరగనున్న , ఆరోగ్యకర,గ్రామాలకోరకు జాతీయ వర్క్ షాప్ ప్రారంభ కార్యక్రమానికి విచ్చేసిన కేంద్ర పంచాయతీరాజ్ శాఖామాత్యులు కపిల్ మోరేశ్వర్ పాటిల్ మరియు రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మరియు పంచాయతీ రాజ్ శాఖామాత్యులు బూడి ముత్యాలనాయుడు కి పరవాడ జడ్పిటిసి సభ్యులు మరియు స్టాండింగ్ కమిటీ సభ్యులు పిఎస్ రాజు పుష్ప గుచ్చం అందజేసి ఘన స్వాగతం పలికారు.. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ జె.సుభద్ర తదితరులు పాల్గొన్నారు..

# ఎఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయం



విశాఖ రూరల్ : మధురవాడ (విజయభాను న్యూస్) : మహా విశాఖ 6వ వార్డు పరిధి పీఎంపాలెం లో విశాఖ పార్లమెంటరీ అధికార ప్రతినిధి, 6 వ వార్డు టీడీపీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ అధ్యక్షతన, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు గరే గురునాథ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ 28వ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగువాడి పౌరుషాన్ని ఢిల్లీ గడ్డకు రుచి చూపించి, ఆంధ్రుల ఆత్మగౌరవం అను నినాదంతో తెలుగుదేశంపార్టీ స్థాపించి తొమ్మిది నెలల్లోనే అఖండ విజయం సాధించి, ప్రజల హృదయాల్లో చిరస్మరణీయంగా ఉన్నారని కొనియాడారు. జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు గరే గురునాథ్ మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు అయన అందించిన సేవలు మరువలేనివని అన్నారు. కిలో బియ్యం కేవలం 2 రూపాయలకే అందించిన మహా నాయకుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గొల్లంగి ఆనంద్ బాబు, లోడగల జానకిరామ్, పోతిన రఘు బాబు, బీసీ సెల్ అధ్యక్షులు రెడ్డి సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు పెంటకోట బబ్బెలు, బూత్ కన్వీనర్స్ కంచర్ల సర్వ దేవుళ్ళు, బలరామూర్తి, కొరగంజి సూరిబాబు, అబ్దుల్ బాషా, కృష్ణ, సుంకరరాజు, బాబ్జి, ప్రతాప్, పోతిన రమణ, రెడ్డి, రాజు, తదితరలు పాల్గున్నారు.

# తెలుగుజాతికి ఎనలేని సేవలు అందించిన మహోన్నత వ్యక్తి నందమూరి తారక రామారావు

## - ఎన్టీఆర్ ఆశయసాధనకై ప్రతిఒక్క కార్యకర్త కృషి చేయాలి
## - 50వ వార్డులో సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ 28వ వర్ధంతి,ఘన నివాళులు



మురళీనగర్(విజయభాను న్యూస్) : తెలుగుజాతికి ఎనలేని సేవలు అందించిన మహోన్నత వ్యక్తి నందమూరి తారక రామారావు అని 50వ వార్డ్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు,తెలుగుదేశం పార్టీ పార్లమెంటరి అధికార ప్రతినిధి సనపల వరప్రసాద్ అన్నారు.దివంగత నందమూరి తారక రామారావు 28వ వర్ధంతి సందర్బంగా వరప్రసాద్ ఆధ్వర్యంలో మురళీనగర్ వద్ద గల తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీ గా బయలుదేరి బిర్లా జంక్షన్ వద్ద గల ఎన్ టి ఆర్ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, నటరత్న,కళాప్రపూర్ణ, తెలుగు జాతి ముద్దుబిడ్డ, ప్రపంచవ్యాప్త తెలుగువారంతా ఆప్యాయంగా పిలుచుకునే అన్న మరియు అభిమానుల పాలిట దైవం స్వర్గీయ నందమూరి తారక రామారావు అని అన్నారు.తెలుగుదేశం పార్టీ ప్రతి కార్యకర్త భవిష్యత్తులో ఎన్టీఆర్ ఆశయసాధనకై కృషి చేయాలని,నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేసేందుకు కృషి చేయాలనీ సనపల వరప్రసాద్ పిలుపునిచ్చారు.ఈ సందర్బంగా వరప్రసాద్,తెలుగుదేశం పార్టీ నాయకులు చేతులు మీదుగా వృదులకు పండ్లు పంపిణి చేసారు.ఈ కార్యక్రమంలో సనపల రామచంద్రరావు,ఎన్ టి ఎస్ కుమార్,అజయ్, నాగన్న,సనపల విజయ్ కుమార్,కంచరాణ వరదరాజు,నంబాళ్ల సత్యనారాయణ,సనపల సత్యనారాయణ,మూల రాము,సత్యవతి, తదితరులు పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ–జనసేన కూటమి అధికారంలోకి వస్తుంది వచ్చే ఎన్నికల్లో టీడీపీ–జనసేన కూటమి అధికారంలోకి వస్తుందని సనపల వరప్రసాద్ పేర్కొన్నారు. అలాగే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి పదవి స్వీకరించి రాష్ట్రాభివృద్ధి చేస్తారని అన్నారు. చంద్రబాబు తోనే రాష్ట్రం అభివృద్ధి చెందటం ఖాయమని అన్నారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు.ప్రజలు అన్ని గ్రహిస్తున్నారని చెప్పారు.వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటమి తప్పదని చెప్పారు.



# రా కదలిరా సభస్థలం ఏర్పాట్లను పరిశీలించిన ఏఎస్పీ ధీరజ్



అరకులోయ (విజయభానున్యూస్) ఈనెల 20న అరకు నియోజకవర్గం డుంబ్రిగూడ మండలం జైపూర్ జంక్షన్ వద్ద జరగనున్న రా కదలిరా బహిరంగ సభా ఏర్పాట్లను అల్లూరి సీతారామరాజు జిల్లా ఏ ఎస్ పి ధీరజ్. గురువారం పరిశీలించారు. సభకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లు హెలిపాడ్, పార్కింగ్ కు సంబంధించిన కేటాయించిన ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం ఏర్పాట్లపై నియోజకవర్గ పరిశీలకులు దువ్వాడపు రామారావు గారిని, తెలుగుదేశం పార్టీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి కిడారి శ్రావణ్ కుమార్ ని అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమం లో పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# కనకమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే వాసుపల్లి దంపతులు

## – వాసుపల్లి దంపతులకు పెల్లిరోజు శుభాకాంక్షలు తెలిపిన పలువురు నేతలు

పూర్ణ మార్కెట్ (విజయభాను న్యూస్): దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ దంపతులు ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. పెళ్లిరోజు సందర్బంగా గురువారం బురుజుపేటలో వెలిసిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ప్రత్యేక పూజలు చేశారు. పూర్ణ కుంభంతో ఆలయ వర్గాలు దంపతులను సాదరంగా ఆహ్వానించి అమ్మవారి దర్శనానంతరం ఈవో శిరీష చేతుల మీదుగా తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఈ సందర్బంగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని, దక్షిణ ప్రజల పుణ్యఫలము వలనే అమ్మవారు ఇక్కడ స్వయంభుగా వెలిశారని గుర్తు చేశారు. ఇక్కడి ఎమ్మెల్యేగా అమ్మ కరుణాకటాక్షంతో రెండుసార్లు ప్రజాసేవ చేసుకునే భాగ్యం కలిగిందని, ఇక్కడి ప్రజలకు ఎమ్మెల్యేగా కాకుండా వారి కుటుంబ సభ్యుడిగా పనిచేస్తున్నానని, వారి ఆశీస్సులతో మళ్ళీ ఎమ్మెల్యేగా వైసిపి జెండా ఎగరవేసి ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డికి బహుమతిగా అందజేస్తానని తెలిపారు. వాసుపల్లి గణేష్ కుమార్ దంపతులకు దక్షిణ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



# విజయభాను సంపాదకీయం

## దారితప్పిన మాల్దీవులు

ఏదో యథాలాపంగా, ఎంతో యాదృచ్ఛికంగా మొదలైనట్టు కనబడిన మాల్దీవుల పంచాయితీ ఆంతర్యం మన దేశానికి దూరం జరగటమేనని తాజా పరిణామాలు మరింత తేటతెల్లం చేస్తున్నాయి. భారత వ్యతిరేకతే అస్త్రంగా ఎన్నికల్లో ప్రచారం చేసి మొన్న నవంబర్‌లో అధికారంలో కొచ్చిన అధ్యక్షుడు మహమ్మద్ మెయిజూ ఇప్పటికీ అదే పోకడలు పోతున్నారు. లక్షద్వీప్‌లో పర్యటించిన సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ఒక ఛాయాచిత్రాన్ని పోస్టు చేసినప్పుడు ముగ్గురు మాల్దీవుల మంత్రులు చేసిన వ్యాఖ్యలపై రాజుకున్న రగడ తర్వాత ఆ దేశం ఒకటొకటిగా చర్యలు మొదలుపెట్టింది.

మన దేశం బహుమతిగా ఇచ్చిన రెండు తేలికపాటి అధునాతన ధ్రువ హెలికాప్టర్లు వెనక్కు తీసుకోవాలని కోరటంతో పాటు వచ్చే మార్చి 15లోపు దేశంలోవున్న భారత సైనిక దళాలను ఉపసంహరించాలని తుదిగడువు విధించారు. కేవలం 88 మంది సైనికుల వల్ల తమ దేశానికి ముప్పు ముంచుకొస్తుందంటూ హడావిడి చేస్తున్నారు. అధికారంలోకొచ్చిన వెంటనే భారత పర్యటనకొచ్చే సంప్రదాయాన్ని పక్కనబెట్టి మెయిజూ టర్కీని ఎంచుకున్నారు. ఆ తర్వాత యూఏ ఈలో జరిగే కాప్ 28 సదస్సుకెళ్లారు. తాజాగా ఈ నెల 8 నుంచి 12 వరకూ చైనాలో పర్యటించారు. 'భౌగోళికంగా ఆకారంలో చిన్నదైనంత మాత్రాన మాల్దీవులు ఎవరి బెదిరింపులకూ లొంద'ని హెచ్చరించారు. వీటన్నిటి వెనుకా ఉన్నదెవరో సులభంగానే పోల్చుకోవచ్చు.

మనకూ, మాల్దీవులకూ వున్న బంధం చాలా పాతది. అలాగని భారత్‌పై విద్వేషాన్ని వెళ్లగక్కే శక్తులకు అక్కడ కొదవేమీ లేదు. దేశ ప్రజానీకంలోవున్న భారత్ అనుకూలతను ఎలాగైనా పరిమార్చాలని చాలామంది రాజకీయ నాయకులు ప్రయత్నించారు. ప్రత్యర్థుల విధానాలనూ, వారి కార్యాచరణనూ తప్పుబట్టడానికి సందు దొరకని ప్రతిసారీ భారత్ ప్రసక్తి తీసుకొచ్చి విమర్శించటం అక్కడ పరిపాటి. గతంలో అబ్దుల్లా యామీన్ సైతం మూడు దశాబ్దాల తన ఏలుబడిలో భారత్ వ్యతిరేక నిర్ణయాలు తీసుకుని, చైనాతో అంటకాగి దేశాన్ని నిండా ముంచారు. ప్రశ్నించినవారిని ఖైదు చేశారు. ఇది సరికాదంటూ తీర్పునిచ్చిన ఇద్దరు సుప్రీంకోర్టు జడ్జీలను జైలుకు పంపారు.

ఆయన నిర్వాకంలో ఆ దేశం చైనా నుంచి భారీగా రుణాలు తీసుకుంది. పెట్టుబడులను ఆహ్వానించింది. వీటివల్ల చెల్లించాల్సిన వడ్డీలే అపరిమితంగా పెరిగిపోయాయి. 2013లో రెండోసారి అధికారంలోకొచ్చాక కూడా యామీన్ తీరు మారలేదు. చివరకు ఆయన విధానాలతో విసిగిన జనం 2018లో ఇబ్రహీం మహ్మద్ సోలిహ్‌ను గద్దెనెక్కించారు. నియంతృత్వ పోకడలకు పోలేదన్న మాటేగానీ... అవినీతిని అంతమొందిస్తానన్న వాగ్దానాన్ని సోలిహ్ నిలుపుకోలేకపోయారు. ఒక అవినీతి కేసులో యామీన్‌కు 11 ఏళ్ల జైలు శిక్ష పడిన మాట వాస్తవమే అయినా, అది మినహా అవినీతి నిర్మూలనకు పకడ్బందీ చర్యలు తీసుకోలేకపోయారు.

ఉపాధి కల్పనలోనూ సొంత మనుషులకే ప్రాధాన్యమిచ్చారన్న ఆరోపణలు వినబడ్డాయి. ఈ అసంతృప్తిని ప్రస్తుత అధ్యక్షుడు మెయిజూ ఆసరాగా తీసుకుని అధికారానికి రాగలిగారు. అయిదున్నర లక్షలమంది జనాభాగల మాల్దీవుల్లో మూడులక్షలమంది సున్నీ ముస్లిమ్‌లు. మతం పేరుతో వీరిలో అత్యధికులను తనవైపు తిప్పుకోవాలని, జాతీయవాదాన్ని రెచ్చగొట్టాలని అంతక్రితం యామీన్ ప్రయత్నించినా ప్రయో జనం లేకపోయింది. కాకపోతే ఈ రాజకీయ క్రీడ చివరకు సెక్యులర్ పార్టీల వైఫల్యంగా మారి మతతత్వ శక్తుల ప్రాబల్యం పెరుగుతుందా అన్న సందేహాలు చాలామందిలో ఉన్నాయి. మెయిజూ అయినా, మరొకరైనా దేశాభివృద్ధిలో భారత్ కీలకపాత్రను తోసిపుచ్చలేరు. ప్రస్తుతం దేశ దిగుమతుల్లో అత్యధిక వాటా భారత్‌దే. దీన్ని తగ్గించుకుందామని ప్రయత్నిస్తే వ్యయం పెరగటం మినహా ప్రయోజనం శూన్యం. ఇక మాల్దీవుల విదేశీ రుణాల్లోనూ సింహభాగం మన దేశానిదే.

గతంలో చైనాతో సాన్నిహిత్యం పెంచుకుని ఎడాపెడా రుణాలు తీసుకుని శ్రీలంక ఆర్థికంగా ఎంత నష్టపోయిందో, ఎలా దివాలా తీసిందో అక్కడి పరిణామాలే తేటతెల్లం చేశాయి. అధికారంలోకొచ్చిన నాటి నుంచీ మెయిజూ పాలనపై దృష్టి నిలపడానికి బదులు చైనాను సంతుష్టిపరచటానికి సమయం వెచ్చిస్తున్నారు. అన్ని దేశాల్లోనూ ఒకే తరహా వ్యవస్థలు,రాజకీయ భావాలుండటం సాధ్యం కాదు. ఎన్నికలప్పుడు ఏం మాట్లాడినా అధికారంలో కొచ్చాక బాధ్యతగా మెలగాలి. దేశ గరిష్ఠ ప్రయోజనాలు గీటురాయిగా ఉండాలి తప్ప, మూరత్వంతో అవతలివారిని నొప్పించటమే ధ్యేయం కాకూడదు. మెయిజూకు ఎన్నికల జాతరలో తలకెక్కిన మత్తు ఇంకా దిగినట్టు లేదు.

లోగడ పాలించిన యామీన్‌కు చైనాతో ఉన్న సాన్నిహిత్యం, ఇటీవల గద్దె దిగిన సోలిహ్ భారత్ అనుకూల ధోరణి జగద్విదితమే అయినా వారిద్దరూ ఇరు దేశాలకూ సమాన దూరంలో మెలుగుతామని ప్రకటించేవారు. విధానాల రూపకల్పనలో, నిర్ణయాల్లో ఎంతోకొంత దాన్ని చేసిచూపేవారు. మెయిజూకు ఆ పరిణతి లేదని ఆయన చర్యలు స్పష్టం చేస్తున్నాయి. అది చాలదన్నట్టు ఇటీవల తైవాన్‌లో చైనాను గట్టిగా వ్యతిరేకించే పక్షమే తిరిగి అధికారంలోకి రాగా, తగుదునమ్మా అంటూ తమది 'వన్ చైనా' విధానమేనంటూ ప్రకటించారు. భౌగోళికంగా చూస్తే మాల్దీవులు 1,190 పగడపు దిబ్బల సముదాయం. కానీ అందులో నివాస యోగ్యమైనవి కేవలం 185 దీవులు మాత్రమే. మన దేశానికి 400 కిలోమీటర్ల దూరంలోవుంటూ మన భద్రత రీత్యా హిందూ మహా సముద్రంలో కీలక ప్రాంతంలో ఉన్న మాల్దీవులు భారత్ చైనాల మధ్య సాగే పందెంలో తలదూర్చి బొప్పి కట్టించుకునే చేష్టలకు దూరంగా ఉండటం అన్నివిధాలా దానికే శ్రేయస్కరం.

# లబ్ధిదారులకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరటమే ఈ ప్రభుత్వ లక్ష్యం

**- జీవో నంబర్ 388, ప్రకారం కన్వీయాన్స్ డీడ్ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో కె కె రాజు**




అక్కయ్యపాలెం(విజయభాను న్యూస్) : లబ్ధిదారులకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరే విధంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిస్వార్థ పాలన సాగిస్తున్నారని విశాఖ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త, రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె కె రాజు అన్నారు.

ఈ మేరకు ఉత్తర నియోజకవర్గం పరిధి అక్కయ్యపాలెం షాదీ ఖానా లో గురువారం సాయంత్రం జరిగిన జీవో నంబర్ 388,ప్రకారం కన్వీయాన్స్ డీడ్ ఇళ్ల పట్టాలు పంపిణీ కార్యక్రమంలో కె కె రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె కె రాజు మాట్లాడుతూ ప్రజలకు విద్య ఉపాధి ఆరోగ్యం చేరువ చేసే విధంగా అహర్నిశలు శ్రమించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇల్లు లేని ప్రజలకు ఇళ్ల స్థలాలు అందించడంతోపాటుగా లబ్ధిదారులకు శాశ్వత భూ హక్కు కలిగే విధంగా పట్టాల పంపిణీ కార్యక్రమానికి శ్రీకరం చుట్టారని అన్నారు.

రాష్ట్రంలో ఇళ్ల పట్టాల పంపిణీ లో 35 లక్ష మంది లబ్ధిదారులకు లబ్ధి చేకూరిందని అలాగే ఉత్తర నియోజకవర్గం సీతమ్మధార తహాశీల్దార్ కార్యాలయం పరిధి లో 148 మంది లబ్ది దారులను గుర్తించగా గోపాలపట్నం తహాశీల్ధార్ కార్యాలయం పరిధిలో 210 మంది లబ్ధిదారులను గుర్తించి ఈరోజు ఆయా లబ్ది దారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించి అనంతరం 45 సంవత్సరాలుగా పరిష్కారం కానీ గాజువాక భూ సమస్యను పరిష్కరించి లబ్ధిదారులకు భూ హక్కు కల్పించారని గుర్తు చేశారు. అలాగే సింహాచలం పంచ గ్రామాల సమస్యను త్వరలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్, మండల పార్టీ అధ్యక్షులు కటుమూరి సతీష్,ఫ్లోర్ లీడర్,మండల పార్టీ అధ్యక్షులు బాణాల శ్రీనివాసరావు,డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మండల పార్టీ అధ్యక్షులు అల్లు శంకరరావు,కార్పొరేటర్లు కఠారి.అనిల్ కుమార్ రాజు, బర్కత్ అలి,శశికళ,కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు,రాష్ట్ర మహిళా విభాగం వైస్ ప్రెసిడెంట్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు పేడాడ రమణికుమారి, రెవెన్యూ అధికారులు, పార్టీ వార్డు అధ్యక్షులు నీలి రవి, పీలా వెంకటలక్ష్మి,పి.సునీత,జేసీఎస్ మండల కన్వీనర్లు బులుసు జగదీశ్,వసంతల అప్పారావు,డైరెక్టర్లు, దిడ్డి రమేష్,ప్రసాద్, ఐ.రవికుమార్, జిల్లా మహిళా జనరల్ సెక్రటరీ యం.లక్ష్మీ,సీనియర్ నాయకులు,అనుబంధ సంఘాల అధ్యక్షులు మరియు సభ్యులు,సచివాలయం కన్వీనర్లు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కవి సమయం

### మఱ్ఱిచెట్టు

ఊడలు నాటే మఱ్ఱిచెట్టులా!
ఎంతో ఘన చరిత్రగలది
కాంగ్రెస్‌పార్టీ
మహావృక్షంలా - వృక్షరాజు ఐ ఉంది
ఈ వృక్ష రాజుకు - చాపక్రింద నీరులా చేరి
అనతికాలంలో ప్రాంతీయ పార్టీలుగా వెలసిల్లే
రెండు నాలుకలతో మాట్లాడే నాగుపాములు
వాడి మీద, వీడు
వీడు మీద వాడు చాడీలు చెప్పుకొనే
దీపావళి టపాస్‌కాయలు
ఒక్కొక్క రాష్ట్రానికి
ఒక్కొక్క కళియుగరావణాసుడు గానో!
నరకాసురుడుగానో! తయారై
కాంగ్రెస్ ప్రగతిని - సుస్థిర స్థానాన్ని
భూస్థాపితం చెయ్యాలని చూస్తున్న
చీడపురుగులు
రాష్ట్రాన్ని - రంపపు కోతకోసి
మధ్య తరగతి కుటుంబీకులను
పీడించే - చండాలులు
వీరి మాటలు - చేష్టలు
విన్నా - కన్నా - చెడుగ ప్రవర్తించినా!
ప్రజాభిష్టంపై - భూస్థాపితం తథ్యం
ఈ సంక్షోభానికి కారకులెవ్వరు?
ఆ వెన్నుపోటు దారులెవ్వరు?
ఈ మధ్య తరగతి కుటుంబీకులను
ఆదుకున్న దెవ్వరు?
నువ్వేగదా! మఱ్ఱివిత్తువై ఇంతింతై
అంతై మఱ్ఱిచెట్టువై
నీ ఊడలు పెకిలించే నరకాసురులను
పధజర్పిన నాడే - నీ స్థానం - సుస్థిరం

**రచయిత**
**యల్.సిద్ధూ**

## పంచాంగం

**పుష్య శు॥ నవమి రా. 11-18 అశ్విని ఉ. 07-0 భరణి రా.తె. 06-11వ.సా. 04-20ల 05-52**

**శుక్రవారం 19-01-2024**

a **మేషం** : ఇతరులకు వాహనం ఇవ్వడంవల్ల ఇబ్బందులను ఎదుర్కొంటారు. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు తొలగిపోతాయి. వస్త్ర, బంగారం, వెండి ఫ్యాన్సీ వ్యాపారాల్లో పోటీతత్వం అధికంగా ఉంటుంది. ఉద్యోగరీత్యా దూర ప్రయాణాలు చేయవలసివస్తుంది. కోర్టు వ్యవహారాల్లో ప్లీడరు ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. గృహ నిర్మాణానికి సంబంధించిన ప్లానుకు ఆమోదం లభిస్తుంది.

b **వృషభం** : ఉద్యోగస్తులు, రాజకీయనాయకులు సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. కానివేళలో ఇతరుల రాక ఇబ్బంది కలిగిస్తుంది. డాక్టర్లు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. ప్రముఖులతో పరిచయాలు వ్యాపకాలు అధికమవుతాయి. మిత్రులతో కలిసి షాపింగ్ చేస్తారు.

c **మిథునం** : ఉపాధ్యాయులకు విద్యార్థుల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది జాగ్రత్త వహించండి. స్త్రీలకు అయిన వారి రాక సంతోషం కలిగిస్తుంది. సిమెంటు, కలప, ఐరన్, ఇటుక, ఇసుక వ్యాపారులకు కలిసిరాగలదు. బ్యాంకు రుణాలు తీర్చడంతో పాటు కొంత రుణం తీసుకుంటారు. బంధువుల మధ్య సయోధ్య లోపిస్తుంది

d **కర్కాటకం** : ఆర్థిక లావాదేవీలు, కుటుంబ సమస్యలు సమర్థంగా పరిష్కరిస్తారు. ఉద్యోగస్తులకు అధికారుల తీరు నిరుత్సాహం కలిగిస్తుంది. ఒక అవసరానికి ఉంచిన ధనం మరో ఖర్చుకు వినియోగించవలసి వస్తుంది. స్త్రీలు తేలికగా మోసపోయే ఆస్కారం కలదు. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు ఒత్తిడి, పనివారలతో చికాకులు తప్పవు..

e **సింహం** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయా ణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు.

f **కన్య** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. పోస్టల్, ఎల్.ఐ.సి, ఏజెంట్లకు పురోభివృద్ధి. వ్యవసాయ, తోటల రంగాల వారికి నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి.

g **తుల** : స్త్రీలతో కలహములు, అన్ని కార్యముల యందు విఘ్నవ ులు ఎదుర్కొంటారు. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటి పైనే శ్రద్ధ వహించండి. పత్రికా సిబ్బందికి వార్తల ప్రచురణలో పునరాలోచన మంచిది. ఏ వ్యక్తితీ అతి చనువు ఇవ్వటం మంచిది కాదు. రుణాలు, పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తారు.

h **వృశ్చికం** : కుటుంబ అవసరాలకు, మీ సంతానం కోసం ఫీజులు, బిల్లులవు చెల్లిస్తారు. వృత్తుల్లో వారికి గుర్తింపు లభిస్తుంది. ముక్కుసూటిగా పోయే మీ తీరు ఇబ్బందులకు దారితీస్తుంది. ప్రింటింగ్, స్టేషనరీ రంగంలోని వారికి పనివారలతో చికాకులను ఎదుర్కుంటారు.

i **ధనుస్సు** : ప్రింటింగ్ రంగాల వారికి బకాయిల వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. బంధువులకు పెద్దమొత్తంలో ధనసహాయం చేయునపుడు పునరాలోచన అవసరం. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

j **మకరం** : ఉపాధ్యాయులకు నూతన వాతావరణం, పరిస్థితులు ఆందోళన కలిగిస్తాయి. సంఘంలో పలుకుబడి గల వ్యక్తుల సహకారంతో మీ పనులు సానుకూలమవుతాయి. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి.యాదృచ్ఛికంగా ఒక పుణ్యక్షేత్రం సందర్శిస్తారు.

k **కుంభం** : స్త్రీలు చీటికి, మాటికి అసహనం, చికాకులు అధికమవుతాయి. అయిన వారిని, ఆప్తులనువిందు భోజనానికి ఆహ్వానిస్తారు. ఆకస్మిక ప్రయాణాలు వాయిదాపడతాయి. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. స్థిరాస్తుల కొనుగోలు యత్నాలు అను కూలిస్తాయి. మీ ఏమరుపాటుతనం, హడావుడి వల్ల వస్తువులు చేజార్చు కుంటారు. వ్యాపారాల్లో కొత్త కొత్త పథకాలతో కొనుగోలు దారు లను ఆకట్టు కుంటారు.

L **మీనం** : ప్రతి చిన్న విషయానికి ఇతరులపై ఆధారపడటం మంచిది కాదు. ప్రైవేటు సంస్థలలోని వారికి యాజమాన్యంతో ఏకీభావం లోపిస్తుంది. భార్య, భర్తల మధ్య మనస్పర్థలు సమసిపోతాయి. వైద్యరంగాల్లోనివారికి శస్త్రచికిత్సల సమయంలో ఏకాగ్రత అవసరం. ఇసుక, భవన నిర్మాణ కాంట్రాక్టర్లకు ఆటుపోట్లు తప్పవు.

# సీఎం జగన్ కోర్టుకు వచ్చే వరకు నాదీక్ష కొనసాగుతుంది

**- రాజ్యాంగ సంస్థల దృష్టికి నా సమస్య చేర వేయండనీ దళిత నేతలకు స్పష్టం చేసిన జనిపల్లి శ్రీనివాస్**




ఆరిలోవ (విజయభాను న్యూస్): కోడికత్తి కేసులో 5ఏళ్ళుగా బెయిల్ రాక జైల్లోనే మగ్గుతున్న నిదితుడు జనిపల్లి శ్రీనివాస్ అనూహ్యంగా గురువారం నుండి జైల్లోనే ఆమరణ దీక్షకు దిగాడు. ఈ సమాచారం తెలిసిన వెంటనే హుటాహుటిన విదసం ఐక్య వేదిక నేతలు జైలుకు వెళ్లి ములాఖాత్ పెట్టీ జనిపల్లి కలిసి సంఘీభావం తెలిపారు.శ్రీనివాస్ ను కలిసిన అనంతరం విదసం ఐక్య వేదిక రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ బూసి వెంకట రావు మీడియా తో మాట్లాడుతూ కొడి కత్తి కేసులో న్యాయం కోసం జనిపల్లి శ్రీనివాస రావు గాంధేయ మార్గంలో నిరాహార దీక్ష ప్రారంభించాడు అని ప్రకటించారు. శాంతియతంగా చేస్తున్న దీక్షకు ప్రభుత్వం నుండి ఏ అంతరాయం లేకుండా చూడాలని కొరాడనన్నారు . ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం తనకు కల్పించిందని జైలు గోడల మధ్య దీక్షను భంగం చెసే పని ప్రభుత్వం చేయకుండా రాజ్యాంగ సంస్థల నుండి అవసరమైన అనుమతులు తేవాలని సంఘ్ నాయకులను శ్రీనివాస రావు కోరినట్టు వేంకట రావు తెలిపారు.

**జైలు బయట శ్రీనివాసకు మద్దతుగా**

జనిపల్లి శ్రీనివాస రావు ఆమరణ దీక్షకు సంఘీభావం.కోడి కత్తి కేసులో ముఖ్య మంత్రి కోర్టుకు హాజరు కావాలి,ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కోర్టులను గౌరవించాలి.

ఎస్సీ యువకుడు జనపల్లి శ్రీను పై ప్రభుత్వ వివక్ష నశించాలి.19 కేసులు ఎత్తివేసిన ప్రభుత్వం కోడి కత్తి కేసు కూడా ఎత్తివేయాలి.అని డిమాండ్ చేస్తూ ప్ల కార్డులు ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య సలహాదారు ఎస్ ఆర్ వేమన, సహాయ కన్వీనర్లు సొడదాసి సుధాకర్, కోలా హరిబాబు, నాయకులు బూల భాస్కరరావు, కొత్తపల్లి వెంకట రమణ, మూర మహేష్, బొడ పాటి శామ్యూల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# దివంగత ఎన్టీఆర్ స్ఫూర్తితో జగన్ ప్రభుత్వాన్ని గద్దించాలి

- ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా " ఎదురులేని మనిషి " ఆడియో ఆవిష్కరణ


జగన్ ప్రభుత్వ వైఖరితో ప్రజలు విసిగి పోయారు

- జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శివ శంకర్

విశాఖపట్నం(విజయభాను న్యూస్): దివంగత నందమూరి తారకరామారావు స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ.. ముందుకు సాగాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. అరాచక పాలన కొనసాగిస్తున్న వైసీపీని గద్దె దించేందుకు ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నందమూరి తారక రామారావు 28వ వర్ధంతి సందర్భంగా ఎదురులేని మనిషి ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని డాబా గార్డెన్స్ లో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో.. ఎదురులేని మనిషి ఆడియో ఆవిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ నాడు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎదురు వెళ్లి తెలుగువారి ఆత్మగౌరవ నినాదంతో కేవలం 9 నెలల్లోనే తెలుగుదేశం పార్టీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకు రాగలిగారు అన్నారు. ఇదే క్రమంలో ప్రస్తుత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కొనసాగిస్తున్న దుష్ట పాలనను అంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ.. ఎన్టీఆర్ ను స్ఫూర్తిగా తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వైయస్ జగన్ నేతృత్వంలో గడచిన నాలుగున్నర సంవత్సరాలకు పైగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూర్తిగా సర్వ నాశనం అయిందన్నారు. మహిళలు ఎస్సీలు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలతో పాటు నిరుద్యోగ యువత దారుణంగా మోసపోయారన్నారు. రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రంలో ఉన్న ఏకైక అతిపెద్ద పరిశ్రమ విశాఖ ఉక్కును కూడా కాపాడుకోలేకపోతున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం - జనసేన పార్టీ రాబోయే ఎన్నికలలో ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు.. నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా ఆర్కే బీచ్ లో ఉన్న ఆయన అగ్రహానికి బి.వి.రామ్ పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు.

**పోరాటయోధుడు తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్**

జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శివ శంకర్ మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వం సాగిస్తున్న అరాచక పాలన పై



తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ చేస్తున్న నిరంతర పోరాటం అభినందనీయమన్నారు. సుదీర్ఘకాలం నుంచి ఆయన తెగువను చూస్తున్నానని.. అనేకసార్లు ఆయన నిర్వహించే కార్యక్రమాలలో పాల్గొనాలని అనుకున్నప్పటికీ అది సాధ్యం కాలేదన్నారు. జనవరి 18న బి.వి.రామ్ జన్మదిన సందర్భంగా ఎదురులేని మనిషి ఆడియో ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఇదిలా ఉండగా వైయస్ జగన్ పాలన పై విసిగి వేసారిపోయిన ప్రజలు అతనిని గట్టిగా బుద్ధి చెప్పేందుకు మానసికంగా సిద్ధమయ్యారని, ఎన్నికలు రావడమే తరువాయని వ్యాఖ్యానించారు.

ఈ కార్యక్రమంలో పసుపులేటి ఉషాకిరణ్, కందులు నాగరాజు, పాలూరు శేషమాంబ, ఎడారి ఉమాశంకర్, కేదార లక్ష్మి, బొడ్డేపూడి దొరబాబు, జి. జగదీష్, పెద్దాడ రమణ, మండవ జ్యోతి, అధిక సంఖ్యలో మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.


# నేరాలు నియంత్రణకు కృషి

## పరవాడ సి ఐ బాల సూర్య రావు



పరవాడ :- పరవాడ మండలంలో నేరాల నియంత్రణకు ఎల్లప్పుడు కృషి చేస్తానని పరవాడ సిఐ బాల సూర్యరావు పేర్కొన్నారు.. గురువారం ఆయన విజయభాను ప్రతినిధితో మాట్లాడుతూ మండలంలో లా అండ్ ఆర్డర్ కు బంగము కలిగిస్తే ఎంతటి వారినైనా సహించేది లేదని పేర్కొన్నారు ... మద్యం తాగి డ్రైవ్ చేసిన, బెల్ట్ షాపులు నిర్వహించిన వారి పై కేసులు తప్పదని హెచ్చరించారు.. పండగలు మరియు తీర్థాలకు కోడిపందాలుకు నో పర్మిషన్ అని అన్నారు.. ప్రజలతో మమేకమై పనిచేయడమే ఆయన ఏకైక ఉద్దేశమని పేర్కొన్నారు.. ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే ఆయనకు ఎంతో ఇష్టమని ఈ సందర్భంగా పరవాడ సిఐ బాల సూర్యరావు పేర్కొన్నారు.

# లివర్ చెడిపోయేందుకు ముఖ్య కారణాలివే..!




మన శరీరంలో లివర్ అత్యంత పెద్దదైన అవయవం. ఇది చేసే పనులు ఎంతో ముఖ్యమైనవి. మనం తిన్న ఆహారాన్ని జీర?ం చేయాలన్నా, శరీరానికి శక్తి సరిగ్గా అందాలన్నా, విష పదార్థాలు బయటికి వెళ్లాలన్నా లివర్ ఎంతో ముఖ్యపాత్ర పోషిస్తుంది. అయితే నేటి తరుణంలో మనం తింటున్న అనేక ఆహార పదార్థాలు, పలు వ్యాధులు, అలవాట్లు లివర్ చెడిపోవడానికి కారణమవుతున్నాయి. వాటి గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

1. చక్కెర లేదా తీపి అధికంగా ఉన్న ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల కాలేయం దెబ్బ తింటుంది. చక్కెరను అతిగా తింటే అది శరీరానికి ఉపయోగం కాదు సరికదా, అది మొత్తం లివర్‌లోనే పేరుకుపోయి కొవ్వుగా మారుతుంది. దీంతో కొంత కాలానికి లివర్ పనితీరు మందగించి అది చెడిపోతుంది.

2. నేటి తరుణంలో ఆహార పదార్థాలను రుచిగా అందించడానికి వాటిలో మోనోసోడియం గ్లుటమేట్ అనే పదార్థాన్ని ఎక్కువగా కలుపుతున్నారు. దీంతో ఈ పదార్థం ఉన్న ఆహారాన్ని తిన్నప్పుడు అది మన శరీరంలోకి ఎక్కువగా చేరుతోంది. దీని ప్రభావం ఎక్కువగా పడడంతో లివర్ చెడిపోతోంది.

3. విటమిన్ ఎ ఉన్న ఆహారం తీసుకుంటే కంటి సంబంధ సమస్యలు ఉండవని అందరికీ తెలిసిందే. అయితే ఈ విటమిన్ శరీరంలో మోతాదుకు మించినా దాని ప్రభావం లివర్‌పై పడుతుందట. దీంతో లివర్ ఆరోగ్యం నాశనమవుతుందట.

4. కూల్ డ్రింక్స్ ఎక్కువగా తాగడం వల్ల కూడా కాలేయం త్వరగా చెడి పోతుంది. కూల్ డ్రింక్స్ లో ఉండే పదార్థాలు కాలేయాన్ని పని చేయకుండా చేస్తాయి.

5. ఉప్పు ఎక్కువగా తినడం వల్ల శరీరంలో ద్రవాల శాతం అధికంగా పెరుగుతుంది. దాంతో కాలేయ సంబంధిత వ్యాధులు వస్తాయి. ఉప్పువల్ల రక్తపోటు కూడా వస్తుందనే విషయం తెలిసిందే.

6. చిప్స్ వంటి ఆహార పదార్థాలను ఎక్కువగా తిన్నా వాటిలో ఉండే విషపూరితమైన పదార్థాలు లివర్ ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపుతాయి. కాబట్టి వాటికి కూడా దూరంగా ఉండడం మంచిది.

7. అధిక బరువు ఉన్నవారు కూడా లివర్ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి. శరీరంలో కొవ్వు ఎక్కువగా పేరుకుపోతే ఫ్యాటీ లివర్ డిసీజ్ వచ్చేందుకు అవకాశం ఉంటుంది. కొన్ని సందరాల్లో లివర్ ఫెయిల్ అవుతుంది కూడా.

8. డయాబెటిస్ సమస్యతో బాధపడే వారికి లివర్ వ్యాధులు వచ్చే అవకాశం 50 శాతం వరకు ఉంటుంది.

9. ఉప్పు ఎక్కువగా తింటే దాంతో బీపీ పెరిగి అది ఫ్యాటీ లివర్ వ్యాధికి దారి తీస్తుంది. కనుక ఉప్పును చాలా తక్కువగా తినడం మంచిది.

10. యాంటీ డిప్రెస్సెంట్స్, మూడ్ స్టెబిలైజర్స్, కార్టికోస్టెరాయిడ్స్, పెయిన్ రిలీవర్స్ వంటి పలు రకాల మెడిసిన్‌లను దీర్ఘ కాలం వాడినా లివర్ ఆరోగ్యం దెబ్బ తింటుంది. డాక్టర్ల సిఫారసు లేకుండా సొంతంగా మందులను వాడినా లివర్ ఆరోగ్యం దెబ్బ తింటుంది.

11. క్యాన్సర్ చికిత్స కోసం చేసే కీమోథెరపీ వల్ల కూడా లివర్ చెడిపోతుంది.

12. హెపటైటిస్ ఎ, బి, సి వంటి వ్యాధులు వచ్చినప్పుడు సరైన సమయంలో స్పందించి చికిత్స చేయించుకోకపోయినా లివర్ ఆరోగ్యం దెబ్బ తింటుంది.

13. పేగుల్లో ఇన్‌ఫెక్షన్లు ఏర్పడి అవి తీవ్రతరమైనా లివర్ చెడిపోయేందుకు అవకాశం ఉంటుంది.

14. క్రిమి సంహారక మందులను వాడి పండించిన కూరగాయలు, పండ్లను తింటే వాటితో ఆ మందులు కూడా మన శరీరంలోకి వెళ్తాయి. అప్పుడు ఆ మందులు లివర్‌పై ప్రభావం చూపిస్తాయి.




# కళ్లకు వ్యాయామం తప్పనిసరి



**రోజంతా** ఆఫీసులో కంప్యూటర్ ముందు కూర్చుని పనిచేయడం, ఇంటికి వచ్చాక టీవీకి అతుక్కుపోవడం లేదా ల్యాప్‌టాప్ ముందుకు కూర్చునే వారి సంఖ్య ఎక్కువే. అయితే ఈ విధంగా గంటల తరబడి కంప్యూటర్లు, టీవీల ముందు కూర్చోవడం వలన చిన్న వయసులోనే కళ్ల సమస్యలు ఏర్పడతాయి. కంప్యూటర్ నుంచి వెలువడే పవర్ వలన కళ్ల చూపు మందగించే ప్రమాదం ఉంది. కనుక కళ్ల కోసం కొంత టైమ్ కేటాయించాలి. కళ్ల సమస్యలు దరిచేరకుండా ఉండాలంటే కళ్లకు అప్పుడప్పుడు కాస్తంత విశ్రాంతిని ఇస్తూ, చిన్న పాట వ్యాయామాలు చేయడం మంచిది. అవి ఎలా చేయాలో మీ కోసం. రెండు అరచేతుల్ని కలిపి రుద్దితే కొన్ని నిమిషాలకు వేడెక్కుతాయి. వాటిని కళ్లపై ఉంచండి. ఇలా చేస్తున్నప్పుడు కళ్లు తెరవకూడదు. కళ్లపై వెలుతురు పడకూడదు. ఇలా రోజులో కుదిరినప్పుడల్లా చేసి చూడండి. కళ్లకు హాయిగా అనిపిస్తుంది.

కంప్యూటరుపై పనిచేసే వారిలో చాలా మంచి కనీసం రెండు నిమిషాలు కూడా కళ్లు మూసి తెరవరు. దాంతో కళ్లు అలసిపోతుంటాయి. ఇలాంటి వారు తరచూ కనురెప్పల్ని మూసి తెరవడం ఓ అలవాటుగా మార్చుకోవాలి. ఇలా ఎన్ని ఎక్కువ సార్లు చేస్తే అంత మంచిది.

కంప్యూటరు ఎదురుగా కూర్చుని పనిచేసే వారు దూరంగా ఉండేవి చూడటంలో ఇబ్బందిపడతారు. దాన్ని అధిగమించాలంటే ప్రతి అర గంటకోసారి ఐదు సెకన్లు దూరంగా ఉండే వస్తువుల్ని చూడాలి. ఇది కళ్లకెంతో మేలు చేస్తుంది. ఇక కళ్లు బాగా అలసిపోయినట్లు అనిపిస్తుంటే, కాసిని నీళ్లు జిలకరించుకోండి. లేదా చన్నీళ్లతో కళ్లను తుడుచుకోండి. దీన్ని కళ్లపై ఉన్న ఒత్తిడిపోయి తాజాగా మారతాయి.

సౌకర్యంగా కూర్చుని చేతి బొటనవేలిని కంటికెదురుగా పెట్టుకుని దాన్ని చూడాలి. తరువాత వేలిని దూరంగా ఉంచి మళ్లీ దృష్టిని దానిపై నిలపాలి. ఇలా కొన్ని నిమిషాలు చేస్తే కళ్లకు విశ్రాంతి లభిస్తుంది.

ఈ విధంగా చేయడం వలన కళ్ల చూపు సమస్యలు దరిచేరవని వైద్య నిపుణులు తేల్చి చెబుతున్నారు.

# క్యారెట్ వల్ల పొందే అదనపు ప్రయోజనాలు

**రోజూ** మనం తీసుకునే కూరగాయలలో ఎన్నో విటమిన్లు మన శరీరానికి లభిస్తున్నం దువల్లే మనం ఆరోగ్యంగా ఉండ గల్గుతున్నాం. ముఖ్యంగా చెప్పాలంటే వాటిలో క్యారె ట్‌ను మించింది మరొకటి లేదు. క్యారెట్‌లో ఎన్నో విటమిన్లతోపాటు మన జీవనాన్ని, ఆరోగ్యాన్ని మెరుగుపరిచే లక్షణాలు పుష్కలంగా వున్నాయి. విటమిన్లు, ఖనిజాలు రెండింటి ఉత్తమ సమతౌల్యంగల కూరగాయ క్యారెట్. తాజా క్యారెట్‌లో మనశరీరానికి అత్యంత ముఖ్యంగా కావలసిన 12 ఖనిజ లవణాల సమతౌల్యాన్ని మనం ఇందులో చూడగలం. మితంగా ఉపయోగపడే పరిమాణ ములో క్యారెట్ విటమిన్ బి.సి.జి లను ఇస్తూ శరీరానికి అవసరమైన పొటాషియం, ఐరన్, మెగ్నీషియం, సోడియం, మాంగనీస్, సిలికాన్, అయోడిన్ లతో పాటు సల్ఫర్, భాస్వరం, క్లోరిన్ వంటి ఖనిజాలను సరఫరా చేస్తుంది. అతి ఉత్తమమైన, సహజమైన కాల్షియం (సున్నం) చక్కటి సమతౌల్యాన్ని అద్భుతంగా ఇది ఇవ్వగలద. క్యారెట్ ప్రయోజనాలు మహిళ కంటే, పురుషులకే ఎక్కువగా ఉన్నాయడంలో ఆశ్చర్యం కలగక మానదు. ఎందుకంటే పురుషులు, రోజూ ఒక ఆపిల్ తినడం కంటే ఒక క్యారెట్ తినడం వల్ల గొప్ప ప్రయోజనాలను పొందవచ్చు అంటారు.

పురుషులుతీసుకొనే ఆహారాల్లో మార్కెట్లో ఉండే అన్ని వెజిటేబుల్స్ లో కంటే క్యారెట్స్ లో అనేక ఆరోగ్యప్రయోజనాలున్నాయి. ఆ ప్రయోజనాలేంటని మనకు ఆశ్చర్యం కలగవచ్చు?క్యారెట్ లోని బీటాకెరోటిన్ స్త్రీలకు మాత్రమే కాదు, పురుషులకు కూడా అధిక ప్రయోజనాలను అంధిస్తుంది. ఆహారనిపుణల ప్రకారం, ఈహెల్తీ వింటర్ వెజిటేబుల్ ను కనీసం వారంలో రెండు సార్లు తీసుకోవాలని అంటున్నారు.

ఈ వింటర్లో ఎదురయ్యే అన్ని ఆరోగ్య సమస్యలను దూరంగా ఉంచే శక్తి సామర్థ్యం క్యారెట్స్ లో పుష్కలంగా ఉంది. క్యారెట్స్‌ను ముఖ్యంగా పురుషుల డైట్ లిస్ లో చేర్చుకోవడానికి ప్రధాన కారణాలేమిటి, వాటి ఆరోగ్యప్రయోజనాలేంటి అన్న విషయాన్ని తెలుసుకోండి. ప్రతి రోజూ క్యారెట్స్ ను తీసుకోవడం వల్ల పురుషులకు కలిగే ప్రయోజనాలేంటో ఇక్కడ ఉన్నాయి. ముఖ్యంగా, 30 ఏళ్ళ వయస్సు దాటిన పురుషులు వారి రెగ్యులర్ డైట్ లో క్యారెట్ ను తప్పనిసరిగా చేర్చుకోవాలి. కాబట్టి, పురుషులు డైట్‌లో క్యారెట్స్ తప్పనిసరి తీసుకోవాలి.

**వీర్యకణాలను మెరుగుపరుస్తుంది:** ఆరోగ్యనిపుణుల ప్రకారం క్యారెట్ లోని అనేక విటమిన్లు, మినరల్స్, కెరోటినాయిడ్స్ పురుషుల్లో వీర్యకణాల క్వాలిటీని మెరుగుపరచడానికి సహాయపడుతం దిని చెబుతున్నారు. కాబట్టి, ఫ్యామిలీ కోసం ప్రయత్నించే వారు వారానికొకసారి క్యారెట్స్ జ్యూస్‌ను తీసుకోవాలి.

**జీర్ణక్రియ:** క్యారెట్స్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది . పురుషులు ఎవరైతే, జీర్ణక్రియ సమస్యలతో బాధపడుతు న్నారో వారు, వారి రెగ్యులర్ ఆహారంలో రోజుకు రెండు సార్లు క్యారెట్స్ ను జోడించండి.

**స్టొమక్ డిజార్డర్:** పురుషులకు క్యారెట్స్ చాలా ఆరోగ్యకరం. పురుషుల్లో వచ్చే అన్నిరకాల డిజార్డర్స్ ను క్యారెట్స్ నివారిస్తుంది. పురుషుల్లో గ్యాస్ట్రిక్ సమస్యను చాలా తేలికగా నివారిస్తుంది.

**కొలెస్ట్రాల్ తగ్గించుటకు:** పురుషులకు క్యారెట్ యొక్క బెస్ట్ బెనిఫిట్, వారిలో కొలెస్ట్రాల్ ను తగ్గించాడానికి సహాపడుతుంది. ప్రతి రోజూ డిన్నర్ తర్వాత ఒక గ్లాస్ క్యారెట్ జ్యూస్ ను తీసుకోండి.

**కళ్ళ ఆరోగ్యానికి :** పురుషులకు ఈ వింటర్ వెజిటేబుల్ యొక్క ముఖ్య ప్రయోజన కంటిచూపును మెరుగుపరుస్తుంది. కంటిచూపును మెరుగుపచడంతో పాటు దీర్ఘకాలిక చూపును మెరుగుపరుస్తుంది.

**గుండె ఆరోగ్యానికి :** గుండెను ఆరోగ్యంగా ఉంచి, గుండె వ్యాధులు రాకుండా కాపాడుతుంది. యారెట్ గుండెకు సంబంధించిన వ్యాధులను దూరం చేస్తుంది. గుండెల్లో మంటగా ఉంటే క్యారెట్‌ను ఉడకబెట్టండి. దానిని చల్లార్చిన తర్వాత ఒక కప్పు రసంలో ఒక చెంచా తేనెను కలిపి సేవించండి. దీంతో గుండెల్లో మంటగా ఉంటే అది మటుమాయం అవుతుంది.

**దంత సంరక్షణకు:** క్యారెట్ల జ్యూస్ వల్లా, క్యారెట్‌ను పచ్చిగా అలాగే తినడం వల్లా నోటి అల్సర్ నివారణ సాధ్య మవుతుంది. క్యారెట్, టమోటా, బత్తాయి పండ్ల రసాలను సమపాళ్ళలో తీసుకుని రెండు నెలల పాటు క్రమం తప్పకుండా వాడి నట్లయితే, నోటి అల్సర్‌నున పూర్తిగా నివారించవచ్చు.

**వ్యాధినిరోధక శక్తి పెంపునకు:** క్యారెట్‌లో రక్తహీనతను పోగొట్టే గుణం ఉంది. రక్తహీనతకు కూడా క్యారెట్ దివ్య ఔషధంగా పనిచేస్తుంది. అధిక పోషక విలువలుండటం వల్ల క్యారెట్‌లో రోగ నిరోధక శక్తి కూడా అధికంగానే ఉంటుంది. ఇందులోని రోగ నిరోధకశక్తి వలన కఠినమైన మొండి రోగాలు, దీర్ఘ వ్యాధులకు సైతం చెక చెప్పవచ్చునం టున్నారు డాక్టర్లు.

# పరకడుపున లీటరు నీళ్లు తాగితే...?

**నేటి** ఆధునిక యుగంలో మారుతున్న ఆహారపు అలవాట్లు, ప్రకృతిలో చోటుచేసుకున్న మార్పులతో పాటు పలు కారణాల వలన మనలను పలు రకాలైన అనారోగ్యాలు వెన్నంటే వుంటాయి. అయితే ఎటువంటి ఆరోగ్య సమస్యలలైనా ఆదిలోనే హరించే దివ్యౌషధం మంచి నీళ్లే అని స్పష్టంగా చెప్పవచ్చు. ప్రతి రోజు ఉదయం పూట లీటరు మంచి నీళ్లు తాగితే పలు రోగాలు మటుమాయమవుతాయని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు.

కార్యాలయాల్లో ఉద్యోగస్తులు రోజుకు తొమ్మిది, పది గంటల పాటు ఒకే సీట్లో కూర్చుని పనిచేస్తుంటారు. అటువంటి వారి పొట్టలో మందం చేరి, జీర్ణశక్తి 0తగ్గిపోతుంది. వారు ప్రతి రోజు ఉదయాన్నే మంచి నీళ్లు తాగితే, ఆ నీళ్లు పొట్టను క్లీన్ చేయడమే కాకుండా జీర్ణ శక్తిని మెరుగుపరుస్తాయి.

ఉదయం పూట వ్యాయామం చేసే అలవాటు ఉన్న వాళ్లు చాలా ఎనర్జీ కోల్పోతుం టారు. అటువంటి వాళ్లకు ఒక లీటర్ మంచి నీళ్లు శరీరానికి ప్రొటీన్స్ బాగా అందేలా చూస్తాయి.



కోల్పోయిన ఎనర్జీని తిరిగి తెస్తాయి. అంతకాదండోయ్ రక్తంలోని మలినాలను తరిమికొడ తాయి. వాతావరణ కాలుష్యం కారణంగా పలువురి చర్మ డల్‌గా తయారవుతుంది. అటువంటి వారు క్రమం తప్పకుండా రోజు లీటరు నీళ్లు తాగితే చర్మ మెరిసిపోతుంది. మితి మీరి బరువు పెరిగిన వాళ్లు ప్రతి రోజు పరకడుపున మంచి నీళ్ల తాగితే బరువు అతి సులభంగా తగ్గిపోతారు. ముఖ్యంగా ఇటీవల అత్యధిక సంఖ్యలో పురుషులు ఎదుర్కనే సమస్య కిడ్నీలో రాళ్ల.

ఈ సమస్యకు అసలైన మందు మంచి నీళ్లే అని వైద్యు లు తెలుపుతున్నారు. రోజూ లీటర్ మంచి నీళ్లు తాగితే కిడ్నీలో రాళ్లు చేతులు. ఇంత టి మేలు చేసే మంచి నీళ్లను తాగడం ఎవరూ మరువకండి.

# తలకు మసాజ్ వల్ల.. అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు



**హెడ్ మసాజ్:** తలకు మసాజ్ చేసుకోవడం లేదా చేయించుకోవడం వల్ల నేచురల్ గా విశ్రాంతి పొంద వచ్చు. మానసికంగా మరియు శారీరకంగా విశ్రాంతి పొందవచ్చు. తలకు మసాజ్ చేయించుకోవడం వల్ల మనస్సు మరియు శరీరం చాలా తేలికపడుతుంది. ఎక్కువ పనిచేసేవారు, ఉద్యోగులు పనిఒత్తిడితో ఒత్తిడి ఎక్కువైనప్పుడు తప్పనిసరిగా వారంలో ఒకసారి తలకు మసాజ్ చేయించుకోవడం మంచిదని నిపు ణులు చెబుతున్నారు. తలకు మసాజ్ చేయించు కోవడం వల్ల ఒత్తిడి నుండి ఉపశమనం కలిగిస్తుంది, తలలో రక్తప్రసరణ మెరుగుపరుస్తుంది, బ్లడ్ ప్రెజర్ తగ్గిస్తుంది. ముఖ్యంగా జీవకణాలను మరియు నరా లను విశ్రాంతి పరుస్తుంది. =జూ్యా మీ=జు: పొట్ట ఉదర భాగంలో మసాజ్ చేయడం వల్ల పొందే ఆరోగ్య ప్రయోజనాలు తలకు మసాజ్ చేయించుకోవడానికి స్పా లేదా సలూన్స్ కు వెళ్ళడం మంచిది. ఇంట్లో కూడా చేసుకోవచ్చు. అలా చేసుకోవడానికి చాలా సింపుల్ అండ్ ఈజీ టిప్స్ ఉన్నాయి ... 4-5 టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనెను వేడి చేయాలి. గోరువెచ్చగా ఉన్నప్పుడు, అందులో చేతి వేళ్ళు నూనెలో డిప్ చేసి తలకు పట్టించి మసాజ్ చేసుకోవాలి. లేదా గోరువెచ్చని నూనెలో కొద్దిగా కాటన్ బాల్ డిప్ చేసి తలకు మసాజ్ చేసుకోవాలి. బాడీ మసాజ్ వల్ల పొందే ఉత్తమ ఆరోగ్య ప్రయోజనాలు ఒత్తిడి లేదా తలలో ప్రెజర్ పాయింట్స్ వద్ద కొద్దిగా ప్రెస్ చేస్తూ సర్క్యులార్ మోషన్ లో మసాజ్ చేసుకోవడం మంచిది 5-10మసాజ్ చేసి, తర్వాత రెండు నిముషాలు విరామం తర్వాత తిరిగి తలకు మసాజ్ చేయాలి. తలకు మసాజ్ చేయడం వల్ల పొందే కొన్ని హెల్త్ బెనిఫిట్స్ ఈ క్రింది విధంగా...**మైగ్రేన్ తలనొప్పిని నివారిస్తుంది:** తలకు డీప్ గా హాట్ ఆయిల్ మసాజ్ చేసుకోవడం ల్ల మైగ్రేన్ సమస్యలను నివారిస్తుంది. రెండు వేళ్ళతో మసాజ్ చేయడం వల్ల తలనొప్పి తగ్గిస్తుంది. నూనె గోరువెచ్చగా ఉన్నప్పుడు ఉపయోగించాలని గుర్తుంచుకోవాలి.

**తలనొప్పి తగ్గిస్తుంది:** కొన్ని నేచురల్ రెమెడీస్ వల్లనే తలనొప్పిని తగ్గించుకోవచ్చు. అయితే తరచూ ఇబ్బంది పెట్టే తలనొప్పిని హెడ్ మాసాజ్ వల్ల మాత్రమే సాధ్యం అవుతుంది. హెడ్ మసాజ్ కు కొన్ని ప్రత్యేకమైన నూనెలో ఉపయోగించడం ల్ల కూడా నొప్పి తగ్గించడంతో పాటు, మనస్సు ఉపశమనం కలిగిస్తుంది.

**వెన్నునొప్పి నివారిస్తుంది:** హెడ్ మాసాజ్ వల్ల మెడ మరియు బ్యాక్ మజిల్స్ రిలాక్స్ అవుతాయి. దాని వల్ల నొప్పి నివారించబడుతుంది. వెన్ను నొప్పి తగ్గించు కోవడానికి. సలూన్ కు వెళ్ళడం మంచిది.

**నిద్రలేమిని నివారిస్తుంది:** రెస్ట్ లెస్ నైట్స్, లేదా నిద్రలేమి సమస్యలకు హెడ్ మసాజ్ చెక్ పెడుతుంది. గోరువెచ్చని నూనెతో సున్నితమైన హెడ్ మసాజ్ చేసుకోవడం వల్ల మంచిగా నిద్రపట్టడానికి సహాయ పడుతుంది.

**బ్లడ్ సర్క్యులేషన్ పెంచుతుంది:** ఆయిల్స్ తోటి తలకు మసాజ్ చేయడం వల్ల రక్తప్రసరణ నరాలకు మెరుగ్గా ప్రవహిస్తుంది. దాంతో శరీరంలో కండరాలు రిలాక్స్ అవుతాయి. మరియు స్ట్రోక్ ను నివారించు కోవచ్చు. మనస్సు తేలికపడుతుంది.


**ఏకాగ్రత మెరుగుపడుతుంది:** పిల్లలు చదువులో ఏకాగ్రత లేనప్పుడు, వారికి సున్నితమైన ఆయిల్ హెడ్ మసాజ్ ఎందుకు ఇవ్వకూడదు. ఇది వారి మూడ్ ను మార్చుతుంది. చదువు మీద, ఆటల మీద ఏకాగ్రత పెరుగుతుంది.

**ఒత్తిడి తగ్గిస్తుంది:** తలకు గోరువెచ్చని నూనెతో మసాజ్ చేయడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. తలకు చేతి వేళ్ళు ఒత్తుకుంటూ మసాజ్ చేసుకోవడం వల్ల మైండ్ రిలాక్స్ అవుతుంది. ఇది హైటెన్సన్ తగ్గిస్తుంది.

**శరీరంను పునరుజ్జీవింపచేస్తుంది:** తలకు మసాజ్ చేసుకోవడం వల్ల మొత్తం శరీరం యొక్క ఆరోగ్యాన్ని మరియు మనస్సును విశ్రాంతి పరుస్తుంది.దాంతో శరీరంను పునరుజ్జీవింపచేయడానికి సహాయపడు తుంది.

# పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపు

## - వై వి సుబ్బారెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేసిన పేడాడ రమణి కుమారి



విశాఖపట్నం(విజయభాను న్యూస్): పార్టీని నమ్ముకుని పార్టీ అభివృద్ధి కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలుగా నియమితులైన అంబేద్కర్ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు పేడాడ రమణికుమారి పేర్కొన్నారు. విశాఖ మహిళా విభాగంలో పార్టీ కోసం కష్టించి పనిచేస్తున్న తనను గుర్తించి రాష్ట్ర మహిళా విభాగంలో చోటు కల్పించడం అభినందనీయమన్నారు. ఈ మేరకు విశాఖపట్నం,అనకాపల్లి,విజయనగరం,అల్లూరి సీతారామరాజు జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ మరియు మాజీ తి.తి.దే చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి రమణి కుమారి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా పార్టీ అధ్యక్షులు కోలా గురువులు,మహిళా జోనల్ ఇంచార్జ్ పీలా వెంకట లక్ష్మి ,ఖారవేల ఎడ్యుకేషనల్,కల్చరల్ అండ్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పేడాడ నరసింగరావు పాల్గొన్నారు.

# నేటి నుంచి జిల్లాలో కుల గణన

## - ఇంటింటికీ వెళ్లి వివరాల సేకరణ
## - జిల్లా కలెక్టర్ డా.ఎ. మల్లిఖార్జున

విశాఖపట్టణం, జనవరి 18 ః కులాల వారీ జనాభా, వారి ప్రస్తుత సామాజిక, విద్య, ఆర్థిక పురోభివృద్ధి తెలుసుకోవడానికి, సముచిత విధాన నిర్ణయాలు చేపట్టడానికి కుల గణన ప్రక్రియను ఈ నెల 19వ తేదీ నుంచి నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన నేపథ్యంలో విశాఖపట్టణం జిల్లా పరిధిలో కూడా శుక్రవారం నుంచి కులగణన చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ డా.ఎ. మల్లిఖార్జున గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో సచివాలయ సిబ్బంది ద్వారా ప్రత్యేక మొబైల్ యాప్ సహాయంతో ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారని పేర్కొన్నారు. ఇది వరకే ఈ సర్వేపై వివిధ వర్గాల ప్రజలు, ప్రతినిధుల అభిప్రాయాలను తెలుసుకోవడానికి జిల్లా స్థాయి సదస్సులు నిర్వహించామని గుర్తు చేశారు. జోనల్, మండల, సచివాలయ స్థాయిలో సిబ్బంది అందరికీ ఈ సర్వే పై సమగ్ర శిక్షణ కూడా అందించినట్లు వివరించారు. వివిధ కారణాల వల్ల సర్వే వాయిదా పడిందని శుక్రవారం నుంచి జిల్లాలో జరుగుతుందని వెల్లడించారు. సర్వేలో భాగంగా వివరాలు సేకరించే సిబ్బందికి ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని ప్రకటన ద్వారా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు సంబంధిత విభాగాల అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఈ విధంగా కులగణన షెడ్యూల్

జనవరి 19 - 28 ః ఇంటింటి సర్వే

జనవరి 29- ఫిబ్రవరి 2 వరకు ః మిగిలిపోయిన ఇళ్లు, వ్యక్తుల వివరాల సేకరణ ఫిబ్రవరి 15 వరకు ః సచివాలయ స్థాయిలో డేటా క్రోడీకరణ ఇతర ప్రక్రియలు.

# వై.వి.సుబ్బారెడ్డి ని సత్కరించిన రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా రాంభుక్త ప్రభాకర్ నాయుడు



భీమునిపట్నం : విజయభాను న్యూస్ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా రాంభుక్త.ప్రభాకర్ నాయుడు నియమితులైన సందర్భంగా గురువారం విశాఖపట్నం,అనకాపల్లి,విజయనగరం,అల్లూరి సీతారామరాజు జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు అనంతరం దుశ్శాలువతో సత్కరించారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బింగి.హరి కిరణ్ రెడ్డి, కొయ్య.రామక్రిష్ణ, ప్రగడ.చంటి, ఆర్.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# జనవరి 22 నుంచి పోలీస్ కమాండో చాంపియన్ షిప్ పోటీలు

## - గ్రే హౌండ్స్ అదనపు డీజీపీ ఆర్.కె.మీనా




విశాఖ రూరల్ : మధురవాడ (విజయభాను న్యూస్) : అఖిల భారత పోలీస్ కమాండో చాంపియన్ షిప్ కాంపిటేషన్స్ - 2024 ఈ నెల 22 నుంచి 30 వరకు జరగనున్నాయని గ్రేహౌండ్స్ అదనపు డిజిపి (ఆపరేషన్స్) రాజీవ్ కుమార్ మీనా వెల్లడించారు. మహా విశాఖ 4 వ వార్డు పరిధి కాపులుప్పాడలో గురువారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో అయన మాట్లాడుతూ దేశంలో 2008 నుంచి ఆల్ ఇండియా పోలీస్ కమాండో కాంపిటేషన్స్ జరుగుతున్నాయని, ఈ సారి నిర్వహిస్తున్న ఏఐపిసిసి-2024 కు ఏపీ పోలీస్ తరపున గ్రేహౌండ్స్ అతిథ్యం ఇస్తోందని అన్నారు. ఈ పోటీలలో మొత్తం 23 జట్లు ద్వారా సుమారు 800 మంది పోలీసు ఉద్యోగులు తలపడుతున్నట్లు అయన ప్రకటించారు. ఈ పోటీలలో 16 రాష్ట్ర పోలీస్, 7 కేంద్ర పోలీస్ సంస్థల జట్లు ఉన్నాయని, మొత్తం 5 దశల్లో పోటీల నిర్వహణ ఉంటుందని అన్నారు. సామర్థ్యం,నైపుణ్యం,ఓర్పు ప్రదర్శించి అత్యున్నత స్థాయి కోసం జట్లు తలపడతాయి అని పేర్కొన్నారు. ఈ పోటీలకు ప్రారంభోత్సవంలో ముఖ్య అతిధి గా రాష్ట్ర హెూమ్ శాఖ మంత్రి తానేటి వనిత హాజరవుతారని అలాగే 30 న జరుగు ముగింపు వేడుకల్లో ఏపీ డీజిపి కె. రాజేంద్రనాథ్ రెడ్డి పాల్గొంటారు అని తెలిపారు. కార్యక్రమంలో గ్రే హౌండ్స్ అధికారులు కోయ ప్రవీణ్, విద్యా సాగర్ నాయుడు, కే.నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 14,872 మంది గృహ లబ్ధిదారులకు వడ్డీ రాయితీ నిధులు

- లబ్ధిదారుల ఖాతాల్లో రూ.90.18 లక్షలు జమ చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి
- వర్చ్యువల్‌గా జిల్లా నుంచి భాగస్వామ్యమైన జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లిఖార్జున,
- నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి
- రాష్ట్ర ముఖ్యమంత్రితో మనోగతాన్ని పంచుకున్న గృహ లబ్ధిదారు కనక హైమావతి



విశాఖపట్నం(విజయభాను న్యూస్): నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జిల్లాలో 14,872 మంది లబ్ధిదారులు వడ్డీ రీయింబర్స్ మెంట్ కింద రూ.90.18 లక్షలు లబ్ధిపొందినట్లు జిల్లా కలెక్టర్ డా.ఎ. మల్లిఖార్జున రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డికి వివరించారు. పేదలందరికీ ఇళ్లు పథకంలో రూ.35 వేలు రుణాలు పొందిన గృహ లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్మెంట్ నిధులను రాష్ట్ర ముఖ్యమంత్రి గురువారం ఉదయం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి విడుదల చేశారు. తొలి దఫాగా 4.07 లక్షల మంది ఖాతాల్లో రూ.47 కోట్లను ముఖ్యమంత్రి జమ చేశారు. వర్చువల్ గా జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లిఖార్జున, నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 1.35 లక్షల మంది లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. అందులో 1.30 లక్షల మంది ఇళ్ళ నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతులు మంజూరు చేశామని వివరించారు. వాటిలో ప్రస్తుతం 94 వేలకు పైగా ఇళ్ళు దాదాపు పూర్తయ్యాయని చెప్పారు. జిల్లాలో ఇళ్ల నిర్మాణాల కోసం 14,872 మంది లబ్ధిదారులు వివిధ బ్యాంకుల నుంచి రూ.35,000 చొప్పున రుణాలు తీసుకున్నారని, వారికి రూ.90.18 లక్షల వడ్డీ రాయితీ వారి ఖాతాల్లో జమకానున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ వివరించారు. ముఖ్యమంత్రి ప్రసంగం అనంతరం జిల్లాలోని అర్హులైన 14,872 మందికి రూ.90.18 లక్షల వడ్డీ రాయితీ నమూనా చెక్కును నగర మేయర్, ఎమ్మెల్సీలతో కలిసి జిల్లా కలెక్టర్ లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో యుసిడి ప్రోజెక్ట్ డైరెక్టర్ కె.వి.పాపి నాయుడు, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ అధికారి డి. అఖిల, కార్యనిర్వాహక ఇంజినీర్లు, ఇతర అధికారులు, లబ్ధిదారులు వర్చ్యువల్ విధానంలో భాగస్వామ్యమయ్యారు. మీ ద్వారా నా కల నెరవేరింది ఏరాష్ట్ర ముఖ్యమంత్రి తో మనోగతాన్ని పంచుకున్న గృహ లబ్ధిదారు కనక హైమావతి నా పేరు కనక హైమావతి. మాది 7వ వార్డు. నేను 12 ఏళ్లుగా చంద్రంపాలెంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాను. ఏ రకమైన ఆర్థిక సహాయమూ నాకు లేదు. ఇల్లు కట్టుకోవాలనే నా కల కలగానే మిగిలిపోయింది. ఇటువంటి తరుణంలో వాలంటీరు ద్వారా నవరత్నాలు - పేదలందరికి ఇల్లు గురించి తెలుసుకొని దరఖాస్తు చేశాను. దరఖాస్తు చేసిన వెంటనే ఆనందపురం మండలం తంగుడు బిల్లి జగనన్న లేఅవుట్ లో నాకు స్థలం ఇచ్చారు. ఇల్లు కట్టుకోవడానికి రుణం మంజూరు చేశారు. దాంతో నేను ఇల్లు నిర్మించుకోగలిగాను. రహదారులు, విద్యుత్, పచ్చదనం, తాగునీరు, మరుగుదొడ్లు ఇలా అన్ని వసతులు కల్పించడంతో ప్రస్తుతం ఆ కాలనీ ఊరుగా మారి పోయింది. ఇపుడు ఆ స్థలం దాదాపు 12 నుంచి 15 లక్షల రూపాయల విలువ పలుకుతుంది. ఏ ఆసరా లేని నాకు, నా కుటుంబానికి మీ ద్వారా రూ.15లక్షల ఆస్తి రావడమే కాకుండా నా కల నెరవేరింది. మా పిల్లలకు అమ్మఒడి వస్తుంది. నాకు ఆసరా వడ్డీ లభిస్తుంది. మా వెంకటేశ్వర స్వయం సహాయక సంఘం ద్వారా నేను రుణాలు పొందుతున్నాను. మాలాంటి నిరుపేదలకు ఇంతకన్నా ఏమి కావాలి అంటూ మళ్ళీ మీరే సీఎంగా రావాలని ఆకాంక్షిస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రితో తన మనోగతాన్ని పంచుకున్నారు.

# నేలపై నిద్రిస్తూ.. కొబ్బరి నీళ్లు మాత్రమే తాగుతూ... : మోదీ కఠిన నియమాలు

దిల్లీ: అయోధ్య రామమందిరం ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి ముహూర్తం సమీపిస్తోంది. రాముడి విగ్రహాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా గర్భగుడిలోకి తీసుకురానున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఆయన 11 రోజుల పాటు అనుష్ఠానం పాటిస్తున్నారు. ఈ క్రమంలో కఠినమైన ఉపవాసం చేస్తున్నారని సమాచారం. ఇందులో భాగంగా ఒక్క దుప్పటి మాత్రమే వేసుకొని నేలపై నిద్రిస్తున్నారని సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. కేవలం కొబ్బరినీళ్లు మాత్రమే తాగుతున్నారన్నారు. అనుష్ఠానంలో భాగంగా పాటించే యమ నియమాల మేరకు సూర్యోదయానికి ముందే నిద్ర లేవటం, యోగా.. ధ్యానం చేయటం, సాత్విక ఆహారం తీసుకోవడం వంటివి ఆచరిస్తారు. ఈ అనుష్ఠానం గురించి గతవారం మోదీ ఆడియో సందేశం విడుదల చేశారు. ఇదిలా ఉంటే.. ప్రాణప్రతిష్ఠకు ముందుగా జనవరి 16 నుంచి ఆరు రోజుల పాటు పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. వ్యక్తిగత, భద్రతా కారణాల రీత్యా ప్రధాని మోదీ నిర్వహించలేరు కాబట్టి, ఆయనకు బదులుగా శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు సభ్యుడు డాక్టర్ అనిల్ మిశ్ర దంపతులు అన్ని పూజల్లో పాల్గొంటున్నారు.

# సామాజిక సమతా సంకల్ప సభకు సర్వం సిద్ధం

## - సాయంత్రం 6 గంటలకు సీఎం జగన్ చేతుల మీదుగా అంబేద్కర్ విగ్రహావిష్కరణ
## - బడుగు బలహీన వర్గాలపై సీఎం జగన్ ప్రేమకు నిదర్శనం ఈ మహా విగ్రహం
## - విగ్రహం రూపకల్పనలో మరో విశ్వకర్మ గా సీఎం జగన్ - దేశంలోనే గొప్ప పర్యాటక కేంద్రంగా ఖ్యాతి
## - ఎంపీ(రాజ్యసభ) విజయసాయి రెడ్డి



అమరావతి(విజయభాను న్యూస్): దేశ చరిత్రలోనే మహాఘట్టంగా నిలిచిపోయే 206 అడుగుల ఎత్తైన డా బి. ఆర్ అంబేద్కర్ మహా విగ్రహం ఆవిష్కరణ నేటి సాయంత్రం 6 గంటలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా జరగనుందని, ఈ అద్భుత ఘట్టాన్ని వీక్షించేందుకు అంబేద్కర్ సిద్దాంతాలకు అభిమానించే వారు, దళితులు, బడుగు బలహీన వర్గాలకు చెందిన సుమారు లక్షా యాభై వేల మంది ప్రజలు హాజరు కానున్నారని రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. విజయవాడలో శుక్రవారం జరగనున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి 'సామాజిక న్యాయ మహాశిల్పం' ఆవిష్కరణ, సామాజిక సమతా సంకల్ప సభ కార్యక్రమాల ఏర్పాట్లను గురువారం నాడు పార్టీ నాయకులతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వి విజయసాయిరెడ్డి పరిశీలించారు..అలాగే అంబేద్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం కింద ఏర్పాటు చేసిన అంబేద్కర్ జీవిత చరిత్రను తెలియజేసే మ్యూజియంను పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ దేశంలో మరెక్కడా లేని విధంగా రూపొందించిన ఈ శిల్ప ఖండం నుండి జీవ కళ ఉట్టిపడుతోందని అన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన సాగించేవారిలో దేశంలోనే ముందుండే సీఎం జగన్ గారు అధికారంలోకి వచ్చి కేవలం నాలుగున్నరేళ్ల కాలంలోనే సాకారం చేశారని అన్నారు. ఈ అద్భుత శిల్ప ఖండం రూపొందించడంలో సీఎం జగన్ మరో విశ్వకర్మ గా మారారని అన్నారు. ఈ మహా విగ్రహం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి బడుగు బలహీన వర్గాల మీద ఉన్న ప్రేమ,అభిమానాలకు ప్రతి బింబిస్తోందని అన్నారు.అంబేద్కర్ స్మృతివనం దేశంలోనే గొప్ప పర్యాటక కేంద్రంగా అవతరించనుందని అన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన మ్యూజియంలో అంబేద్కర్ బాల్యం, విద్యాభ్యాసం, ఇతర ఘట్టాలకు సంబంధించి చిత్రాల్లో జీవం ఉట్టిపడుతోందని అన్నారు. దేశంలో పంజాబ్, ఢిల్లీ, ఇతర ప్రాంతాల్లో ఇటువంటివి ఉన్నా వాటన్నింటికీ మించి సందర్శకులు ఇక్కడ అద్భుత అనుభూతలు పొందుతారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు లక్షా యాభై వేల మంది విగ్రహావిష్కరణకు, బహిరంగ సభకు హాజరవుతారని అన్నారు. అందుకు తగ్గట్టుగా ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాటు పోలీస్ యంత్రాంగం ఇప్పటికే పూర్తి చేసిందని అన్నారు. కులమతాలకు, పార్టీలకు అతీతంగా ఈ మహా కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా హాజరు కావాలని కోరారు. ఈ నెల 20 తేదీ నుండి ప్రజలు నేరుగా సందర్శించే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ ఏర్పాట్లను మంత్రులు మేరుగు నాగర్జున, కే.నారాయణ స్వామి,జోగి రమేష్,ఎంపీలు నందిగం సురేష్, కేశినేని నాని,మాజీ మంత్రులు సుచరిత, వెల్లంపల్లి శ్రీనివాస్, డొక్కా మాణిక్య వరప్రసాద్ రావు, ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్,పార్టీ ఎస్సీ విభాగ అధ్యక్షుడు జూపూడి ప్రభాకర్ రావు, ఎమ్మెల్సీలు తలశీల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి, విజయవాడ తూర్పు నియోజకవర్గ పార్టీ సమన్వయ కర్త దేవినేని అవినాశ్ తదితరులు విజయసాయిరెడ్డి తో కలసి పరిశిలించిన వారిలో ఉన్నారు.



Girls & Working Womens Hostel
1. Homely Food
2. Special locks for each and everybed.
3. Non - A.C Rooms - 5,500
4. A.C & T.V Rooms - 7,500
5. Free Wifi for everyone.
Contact Us
98481 13976
73822 75224
53-22-4, Chaithanya Nagar, Kakathiya Convetion down, Lakshmi Srinivasa Residency, Maddilapalem, Visakhapatnam - 13.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS ., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⁎ Phone : 2564353, Fax : 0891-2569004 ⁎ e-mail: vijayabhanudaily@gmail.com